RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 305 మేడ్చల్ మల్కాజ్‌గిరి 26 నవంబర్ 2024 మంగళవారం పేజీలు : 4

## జామా మసీదు సర్వేలో ఉద్రిక్తత

లఖ్‌నవూ: ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో షాహీ జామా మసీదు సర్వే సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో పోలీసులు బాష్పవాయువు గోళాలను ప్రయోగించారు. లాఠీచార్జి చేశారు. ఈ ఘటనల్లో ముగ్గురు ఆందోళనకారులు మృతిచెందగా.. 30 మంది పోలీసులు గాయపడ్డారు. షాహీ జామా మసీదు ప్రాంతంలో హరిహర ఆలయం ఉండేదని పేర్కొంటూ సుప్రీంకోర్టు న్యాయవాది విష్ణుశంకర్ జైన్(జ్ఞానవాపి కేసులో హిందువుల తరఫు లాయర్) స్థానిక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 1529లో ఆలయాన్ని కూల్చిన మొఘల్ చక్రవర్తి బాబర్.. ఇక్కడ షాహీ జామా మసీదును నిర్మించినట్లు కోర్టుకు వెల్లడించారు. మొఘలుల కాలం నాటి పుస్తకాలు 'బాబర్ నామా', 'ఆయినే-ఇ-అక్బర్'ను ఆధారాలుగా చూపించారు. ఈ కేసులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జామా మసీదు కమిటీ, సంభాల్ జిల్లా కలెక్టర్‌ను ప్రతివాదులుగా చేర్చారు.

# 2027లోనే లోక్‌సభ

## ఏపీ, తెలంగాణ అసెంబ్లీకి ఎన్నికలు..!




హైదరాబాద్ / అమరావతి : 2029లో జరగాల్సిన లోక్‌సభ, ఏపీ అసెంబ్లీ ఎన్నికలు, 2028లో జరగాల్సిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు అన్నీ 2027లోనే జరగబోతున్నాయి. ఇక జమిలీని ఆపడం ఎవరి తరమూ కాదు%ౌ% మహారాష్ట్ర గెలుపు ఊపుతో ఉన్న ప్రధాని నరేంద్రమోడీ 2027లో వన్ నేషన్- వన్ ఎలక్షన్‌కు పావులు కదుపుతున్నారు. ఇక దాన్ని ఆపడం కష్టమే%ౌ% మహా మ్యాండేట్ మోడీ పాలనకు లిట్మస్ టెస్ట్ అని బీజేపీ చెబుతోంది. మహారాష్ట్రలో సునామీ స్థాయి విజయం అధికార బీజేపీకి బిగ్ బూస్ట్‌లా మారింది. కమలం దూకుడు ముందు వందేళ్ల పైబడ్డ పార్టీ కూడా తోకముడిచింది. రాజకీయ చాణుక్యుడు శరద్‌పవార్ ఎత్తులు పారలేదు. ఉద్ధవ్‌థాక్రే పాచికలూ పనిచేయలేదు%ౌ% ఘన చరిత్ర కలిగిన కాంగ్రెస్ ఆటలో అరటిపండులా మిగిలిపోయింది. మహారాష్ట్ర కట్టగట్టుకుని బీజేపీ కూటమి మహాయుతికి జై కొట్టింది. అసలు గెలుపే కష్టమనుకున్న క్యాష్‌రిచ్ మహారాష్ట్రలో ఈ స్థాయి గెలుపు కమలానికి ఎనలేని ఉత్సాహాన్నిచ్చింది. బీజేపీ చేపట్టాలనుకున్న పలు సంస్కరణలకు ఈ విజయం ఓ ఎంట్రీ కార్డులా మారింది. మోడీ దూకుడు, బీజేపీ విజయాలు చూస్తుంటే 2027లో జమిలీ ఎన్నికలు తప్పదనే అనిపిస్తోంది. ఇప్పటికే మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఇచ్చిన నివేదికను కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. అయితే రాష్ట్రాల ఎన్నికల కారణంగా ప్రాసెస్‌ను కాస్త స్లో చేసింది. కానీ ఇప్పుడు మహా గెలుపుతో జూలు విదిల్చి జమిలీపై ఫోకస్ పెట్టబోతున్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది. త్వరలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో జమిలీ ఎన్నికలపై బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉందని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి. అందరి మద్దతును కూడగట్టి వీలైనంత త్వరగా జమిలికి లైన్ క్లియర్ చేయాలన్నది బీజేపీ ఆలోచన. రానున్న మూడు నెలలు కీలకమని పొలిటికల్ పండిట్స్ చెబుతున్నారు. దేశంలో బీజేపీ, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలే ఎక్కువ. కాబట్టి ఆ బిల్లుకు మెజారిటీ రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోదం తెలపడం లాంచనమే. అది జరిగిన వెంటనే ఎన్నికల సందడి మొదలైపోతుంది. తమకు ఎదురులేదు కాబట్టి మోడీ జమిలీ ఆలోచనకు బ్రేక్ పడే అవకాశాలు అసల్లేవు. పైగా జమిలీపై ముందుకెళ్లడానికి ఇదే సరైన సమయమని బీజేపీ భావిస్తోంది. ఇప్పటికే భాగస్వామ్య పార్టీలకు ఈ దిశగా సంకేతాలు కూడా ఇచ్చింది బీజేపీ. ఇప్పుడు స్పీడ్ పెంచితే 2027లో జమిలీ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. దేశమంతా ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే భారీగా ప్రజాధనం ఆదా అవుతుందని కేంద్రం వాదిస్తోంది. పైగా పదే పదే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అభివృద్ధి పనులకు విఘాతం కలుగుతోందని అంటోంది. ఒకేసారి ఎన్నికలు జరిగితే ప్రాంతీయ పార్టీలపై తాము పైచేయి సాధించవచ్చు అని బీజేపీ భావిస్తోంది. కానీ అసలు కథ వేరేగా ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. దేశమంతా కాషాయజెండా ఎగరాలన్నది ఆర్ఎస్ఎస్ కల. అందులో భాగంగానే జమిలీ అన్న ప్రచారం కూడా ఉంది. ఒకేసారి ఎన్నికలు జరిగితే గెలుపు తమదేనని బీజేపీ భావిస్తోంది. పైగా మోడీ నాలుగోసారీ ప్రధానిగా పదవిని చేపట్టవచ్చు. మొన్నటి ఎన్నికల్లో బీజేపీ హ్యాట్రిక్ కొట్టినా చావు తప్పి కన్ను లొట్టపోయినట్లైంది పరిస్థితి. 4వందల సీట్లనుకుంటే కేవలం 240సీట్లే వచ్చాయి. అందుకే జమిలీ పెడితే తమకు సీట్లు పెరుగుతాయన్నది బీజేపీ ఆలోచన. రాజకీయంగా బీజేపీకి ఇది అద్భుతకాలమనే చెప్పాలి. ఇప్పటివరకూ మోడీకి ఎదురులేదు. అలాగే కాంగ్రెస్‌కు దిశ, దశ లేదు%ౌ% ఇండియా కూటమిగా ఏర్పడినా ఇప్పటివరకూ కలిసి విజయం సాధించిన సందర్భాలు లేవు. కశ్మీర్, జార?ండ్ లాంటి ఒకటీ అరా చోట్ల గెలిచినా అది కాంగ్రెస్ బలం కాదు.. ప్రాంతీయ పార్టీల బలమే కాంగ్రెస్‌ను గెలిపించింది. కాంగ్రెస్‌ను పూర్తిగా చంపేయడానికి ఇదే సరైన టైమ్ అన్నది బీజేపీ ఆలోచనలా ఉంది. జమిలి తప్పదని చాలా పార్టీలు ఇప్పటికే డిసైడైపోయాయి. అటు టీడీపీ అధినేత చంద్రబాబు కూడా అసెంబ్లీలోనే 2027లో ఎన్నికలు అన్నట్లు మాట్లాడారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ కూడా మరో రెండేళ్లలో ఎన్నికలు ఉన్నాయంటున్నారు. దానికి రెడీ అవ్వాలని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఇప్పుడు కాంగ్రెస్‌కు కూడా జమిలీ తప్పదని దాదాపు అర్థమైనట్లుంది. మహారాష్ట్రలో గెలిచి ఉంటే ఆ ఊపుతో ధైర్యంగా పోరాడే అవకాశం ఉండేది. కానీ మహా ఓటమితో కాంగ్రెస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. వన్ నేషన్ వన్ ఎలక్షనే కాదు మరికొన్ని అంశాలు కూడా బీజేపీ టాప్ లిస్ట్‌లో ఉన్నాయి. యూనిఫామ్ సివిల్ కోడ్ అమలు దిశగా అడుగులు వేయవచ్చు. ఇవే కాదు బీజేపీ అమ్ములపొదిలో మరికొన్ని అస్త్రాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అవన్నీ ఒకదాని వెనుక ఒకటి అమలు చేసే అవకాశం ఉంది.




## కేటీఆర్ ఫెయిల్.. రంగంలోకి కవిత...

# కేసీఆర్ న్యూ ప్లాన్ ఇదేనా?

హైదరాబాద్ : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత మళ్లీ రాజకీయాల్లో యాక్టివ్ అయ్యారు. అటు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూనే ఇటు ప్రజాక్షేత్రంలోనూ అడుగుపెట్టారు. ఇటీవల అదానీ కేసు విషయంలో కవిత కేంద్రంపై విమర్శలు కురిపించిన సంగతి తెలిసిందే. ఆ తరవాత గురుకులలో ఫుడ్ పాయిజన్ కు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినిని పరామర్శించి కాంగ్రెస్ సర్కార్ పై విమర్శలు కురిపించారు. దీంతో కవితక్క ఈజ్ బ్యాక్ అని ఆ పార్టీ నేతలు, జాగృతి తమ్ముళ్లు సంబురాలు చేసుకుంటున్నారు. అయితే కవిత రీఎంట్రీ పార్టీ కార్యకర్తల్లో జోష్ పెంచినా అన్న కేటీఆర్ కు మాత్రం పోటు తప్పదనే వార్తలు గుప్పుమంటున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి కవిత జైలులోనే ఉన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీని ముందుండి నడిపిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఏర్పడి నెల తిరగకముందే ఆయన విమర్శలు చేయడం పార్టీకి నెగిటివిటీని తెచ్చిపెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రతి పథకంలో బొక్కలు వెతకడం.. ఏ పని ముందేసుకున్నా ప్రెస్ మీట్ పెట్టి విమర్శించడంతో కేటీఆర్ పై ప్రజలకే కాకుండా సొంతపార్టీ నేతలకు సైతం విసుగు వచ్చిందట. కేవలం సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానళ్ల కారణంగానే తాము ఓడిపోయామని ఆయన చెప్పడంతో పాటూ ఇప్పుడు కేవలం సోషల్ మీడియానే నమ్ముకుని రాజకీయాలు చేయడం ఆ పార్టీ నేతలకు సైతం నచ్చడంలేదట. ఇక లోక్ సభ ఎన్నికల సమయంలో ఉద్యమ పార్టీకి ఘోరపరాభవం కలగటానికి కూడా ఆయనే కారణమని విమర్శలు వచ్చాయి. కేటీఆర్ కు అర్బన్ కు రూరల్ కు తేడా తెలియదని బీఆర్ఎస్ సోషల్ మీడియా బహిరంగంగా కామెంట్లు చేసింది. కేటీఆర్ హైదరాబాద్ లో ఇచ్చిన స్పీచ్ నే ఆదిలాబాద్ లో ఇచ్చి విమర్శలపాలయ్యారు. లోక్ సభ ఎన్నికల్లో ఘోరపరాభవం తరవాత కూడా ఆయన తీరుమారలేదు. తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎలా వ్యవహరించారో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా ఆ తీరుగానే వ్యవహరిస్తున్నారు. దీని ఫలితంగా పార్టీకి చాలా మంది సీనియర్లు దూరం అయ్యారు. జిల్లాలు, గ్రామస్థాయిలోనూ బీఆర్ఎస్ చాలా మంది కార్యకర్తలను కోల్పోవాల్సి వచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో కేసీఆర్ కొడుకు కేటీఆర్ ను కాకుండా కవితను ముందుంచి రాజకీయాలు చేయాలని భావిస్తున్నారట. ఈ నేపథ్యంలోనే జైలుకు వెళ్లొచ్చిన గ్యాప్ లో కేసీఆర్ కూతురుకు రాజకీయ పాఠాలు భోదిస్తున్నారని అప్పట్లో వార్తలు వినిపించాయి. అంతే కాకుండా కవితను ముందుంచి రాజకీయాలు చేసేందుకు త్వరలోనే పార్టీలో కీలక పదవి అప్పగించబోతున్నట్టు ప్రచారం జరుగుతోంది. గతంలో బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలిగా గుండు సుధారాణి వ్యవహించిన సంగతి తెలిసిందే. ఆమె పార్టీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ లో చేరారు. చాలా కాలం నుండి బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలి స్థానం ఖాళీగానే ఉంది. ఇప్పుడు ఆ స్థానంలో కవితను నియమించబోతున్నట్టు తెలుస్తోంది. అదే జరిగితే కవిత పార్టీలో మరింత కీలకంగా మారే అవకాశం ఉంది. అంతే కాకుండా ఇప్పటికే కేటీఆర్ పై పార్టీలో వ్యతిరేకత నెలకొనగా కవిత జాగ్రత్తగా వ్యవహరిస్తే కేసీఆర్ తరవాత తానే కీలకంగా మారే అవకాశాలు సైతం ఉన్నాయి.



## కాళేశ్వరం ప్రాజెక్టు పనుల రికార్డులు స్వాధీనం..

హైదరాబాద్: మేడిగడ్డ సహా కాళేశ్వరం ఆనకట్టలకు సంబంధించిన పనుల రికార్డులను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ క్షేత్రస్థాయి ఇంజినీర్ల నుంచి స్వాధీనం చేసుకుంది. మేడిగడ్డ ఏఈఈ, డీఈలను కమిషన్ ఇవాళ విచారించింది. ఆనకట్టల నిర్మాణం, పనులు, వివరాలపై జస్టిస్ పీసీఘోష్ ఆరా తీశారు. ఇంజినీర్లపై అసంతృప్తి వ్యక్తం చేసిన జస్టిస్..అడిగిన ప్రశ్నలకు మాత్రమే సమాధానాలు చెప్పాలని, ముందే అనుకొని వచ్చి అసంబద్ధమైన సమాధానాలు చెప్పొద్దన్నారు. క్షేత్రస్థాయిలో జరిగిన పనులకు సంబంధించిన రిజిస్టర్లను స్వాధీనం చేసుకున్న కమిషన్.. వాటిపై ఇంజినీర్ల చేత సంతకాలు తీసుకొంది. కాళేశ్వరంలో జరిగిన పనులపై ప్లేస్‌మెంట్ రికార్డులు రోజువారీగా చేశారా? లేదా ఒకరోజు పనిని మరొక రోజు నమోదు చేశారా? అని ప్రశ్నించింది. 2020లోని కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజీ వద్ద డ్యామేజీని గుర్తించి ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థలకు లేఖలు రాసినట్లు ఇంజినీర్లు తెలిపారు. క్వాలిటీ కంట్రోల్‌కు సంబంధించి కొన్ని రిజిస్టర్లు గల్లంతు అయినట్లు కమిషన్ గుర్తించింది.

## తెలంగాణ కేబినెట్ విస్తరణకు

# కౌంట్ డౌన్

## పరిశీలనలో ఉన్న పేర్లు ఇవే..




హైదరాబాద్ : ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న కేబినెట్ విస్తరణకు కౌంట్ డౌన్ స్టార్ట్ అయింది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తుండటంతో దానికంటే ముందే ముహూర్తం ఫిక్స్ కానుంది. ఆ తర్వాత అసెంబ్లీ సమావేశాలు డిసెంబర్ 9 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో రైతు, కుల గణన సర్వే, మరియు ఆర్ ఓ ఆర్ చట్టంపై చర్చ జరగనుంది. ప్రభుత్వం ఇప్పటికే అనేక కీలక అంశాలను ఈ సమావేశాల్లో ముందుకు తీసుకురావడానికి సిద్ధమవుతోంది. డిసెంబర్ 7తో రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన పదవీకాలంలో ఏడాది పూర్తి చేయనుంది. ఈ సందర్భంగా మంత్రివర్గ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల అనంతరం ఈ ప్రక్రియ వేగం పుంజుకోనుందని తెలుస్తోంది. నిజామాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి వంటి జిల్లాలకు ప్రస్తుతం కేబినెట్‌లో ప్రాతినిధ్యం లేకపోవడం, విస్తరణను మరింత కీలకంగా మారుస్తోంది. ఈ మంత్రివర్గ విస్తరణలో మైనారిటీలకు ప్రాధాన్యత ఇవ్వాలని, యువతకు అధిక అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యంగా ముదిరాజ్ సామాజిక వర్గానికి ఒక బెర్త్ కచ్చితంగా ఇస్తామని సీఎం హామీ ఇచ్చారు. విస్తరణలో తోడుగా కొన్ని శాఖల మార్పు కూడా ఉండే అవకాశం ఉంది. మొత్తం 6 మంత్రివర్గ స్థానాల కోసం 10 మంది ఎమ్మెల్యేలు పోటీ పడుతున్నారు. అదిలాబాద్ నుంచి ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వివేక్, గడ్డం వినోద్‌బీ నిజామాబాద్ నుంచి సుదర్శన్ రెడ్డి, మదన్ మోహన్ రావుబీ మహబూబ్ నగర్ మక్తల్ నుండి వాకిటి శ్రీహరి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఎస్టీ కోటాలో బాలునాయక్, నల్గొండ జిల్లాలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బలమైన ఆశావహులుగా ఉన్నారు. ఇదిలా ఉంటే రాష్ట్రంలో త్వరలోనే పంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. ఆసరా పెన్షన్, రైతు భరోసా వంటి పథకాల అమలుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ పథకాలు ప్రజల్లో ప్రభుత్వం పై నమ్మకాన్ని పెంచేందుకు దోహదపడతాయని భావిస్తోంది. ఇదిలా ఉంటే కొండపోచమ్మ సాగర్ సమీపంలోని హరీష్ రావు ఫాం హౌస్ పై విచారణను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ చర్యతో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కనుంది. ఇవన్ని రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారాయి . డిసెంబర్ సమావేశాలు, మంత్రివర్గ విస్తరణపై అందరి ఫోకస్ ఉంది.

## సంపాదకీయం

### శరద్ పవార్ కి రిటైర్మెంట్ ఇచ్చేశారా ?

ఆయనను మరాఠా దిగ్గజం అని పిలుస్తారు. ఆయన రాజకీయ ఎత్తుగడకు ప్రత్యర్థులకు అందనంత ఎత్తులో ఊహకు సైతం తెలియనంత లోతులో ఉంటాయి. శరద్ పవార్ ది దాదాపుగా ఏడు దశాబ్దాల రాజకీయ జీవితం. 1958లో కాంగ్రెస్ పార్టీలో చేరి ప్రాధాన్యత ఇచ్చి యూత్ కాంగ్రెస్ నాయకుడు అయ్యారు. ఆ తరువాత 1962లో పూనా జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడయ్యారు. 1967లో 27 సంవత్సరాల వయసులో మహారాష్ట్ర శాసనసభకు బారామతి నియోజకవర్గానికి అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. ఆ తరువాత మంత్రి పదవులు చేపట్టి 1978లో ఏకంగా సీఎం గా అయ్యారు. ఇందిరాగాంధీకి ఒకనాడు అత్యంత సన్నిహితుడుగా పేరున్న శరద్ పవార్ రాజీవ్ గాంధీతోనూ సాన్నిహిత్యం నెరిపి మరోమారు సీఎం అయ్యారు. అలా ఆయన ముఖ్యమంత్రిగా అనేక సార్లు చేశారు. కేంద్రంలో మంత్రిగానూ చేశారు. దాదాపుగా 66 ఏళ్ళ రాజకీయ జీవితం ఆయన సొంతం 1999లో సోనియాగాంధీ విదేశీ మూలాలను ప్రశ్నించి ఆ పార్టీ నుంచి వేరు పడ్డారు. ఆ తర్వాత నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీని స్థాపించి పాతికేళ్ళుగా ఒంటి చేత్తో నడుపుకుని వస్తున్నారు ప్రతీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ కనీసం ముప్పయ్ నుంచి నలభై సీట్లకు తగ్గకుండా గెలుస్తూ రాష్ట్ర రాజకీయాల్లో తన వంతు పాత్ర పోషించే ఎన్సీపీకి 2024 ఎన్నికల్లో 10 సీట్లు మాత్రమే దక్కాయి. అంటే శరద్ పవార్ పవర్ పూర్తిగా లేకుండా పోయింది అని అంటున్నారు. తన సోదరుడి కుమారుడు అజిత్ పవార్ దెబ్బ తీశారని ఆగ్రహించిన పవార్ ఈ ఏడాది మేలో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో జనంలోకి వెళ్ళి గట్టిగానే ప్రచారం చేశారు. ఆయన పార్టీకి 8 ఎంపీ సీట్లు ప్రజలు ఇచ్చారు. అజిత్ పవార్ పార్టీని తిప్పికొట్టారు దాంతో అదే సీను అసెంబ్లీ ఎన్నికల్లో రిపీట్ అవుతుందని భావించిన పెద్దాయనకు దిమ్మ తిరిగే తీర్పు ఇచ్చారు. 2026తో రాజ్యసభ సభ్యత్వం ముగుస్తోంది. శరద్ పవార్ తాను గౌరవంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఈసారి తన పార్టీని గెలిపించాలని అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రజలను అభ్యర్థించారు. కానీ జనాలు మాత్రం బాబాయ్ వద్దు అనేశారు. అబ్బాయి అజిత్ పవార్ పార్టీ అసలైన ఎన్సీపీ అని తేల్చేసి 41 సీట్లు ఇచ్చేశారు దాంతో ఎన్నికల ఫలితాల ద్వారా బాబాయ్ ని పొలిటికల్ గా రిటైర్ అయిపోవచ్చు అని చెప్పేశారు అన్న మాట. ఇపుడు ఎనభై నాలుగేళ్ల వయసులో ఉన్న శరద్ పవార్ లోని పొలిటికల్ పవర్ తగ్గింది అని లేటెస్ట్ రిజల్ట్స్ నిరూపించాయి. ఆయన కుమార్తె సుప్రియా సూలేకు తండ్రి లా పార్టీని నడిపే సత్తా అయితే లేదు అని అంటున్నారు. దాంతో రానున్న రోజులలో ఎన్సీపీ నేతగా శరద్ పవార్ కి అసలైన వారసుడిగా అజిత్ పవార్ ఉండబోతున్నారు అని అంటున్నారు. ఇక శరద్ పవార్ పార్టీ తరఫున గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు కూడా ఆ పార్టీలో ఉంటారా లేక అజిత్ వైపు వస్తారా అంటే దానికి పెద్దగా ఆలోచించాల్సిన అవసరం లేదని అంటున్నారు. కేవలం 18 ఏళ్ళ వయసులోనే రాజకీయాల్లోకి వచ్చిన శరద్ పవార్ ఎనిమిది పదుల వయసులో ఇక రాజకీయాలకు గుడ్ బై చెప్పాల్సిన టైం వచ్చేసింది అని అంటున్నారు. మహా ఫలితాలు అలా డిసైడ్ చేశాయని అంటున్నారు. అదన్న మాట బాబాయ్ పొలిటికల్ ఫ్యూచర్.

# ఇంటి దొంగలు



మల్యాల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో ఇంటి దొంగలు చేతివాటం చూపుతున్నారు. ఆలయానికి నిత్యం వేలాదిగా భక్తులు తరలివచ్చి తమ శక్తికొద్దీ కానుకలు సమర్పిస్తుంటారు. ఆలయ సిబ్బందిలో కొందరు కానుకలు, సరకులను మాయం చేస్తూ స్వామివారికే శఠగోపం పెడుతున్నారు. తాజాగా ఆలయ నిత్యాన్నదాన సత్రంలో పనిచేసే జూనియర్ సహాయకులు రాములు బియ్యం బస్తాలతోపాటు ఇతర సరకులు మాయం చేసినట్లు అధికారుల విచారణలో తేలడంతో మెమో జారీ చేసిన విషయం విదితమే.

కొండగట్టు అంజన్న ఆలయ పరిసరాల్లో భక్తుల కదలికలు, సిబ్బంది పనితీరుపై నిఘావేయడానికి దాదాపు 60 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటి పర్యవేక్షణకు పోలీసు ఔట్‌పోస్టులో రక్షణ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఆలయ పరిసరాల్లోని సీసీ కెమెరాలను హైదరాబాద్‌లోని పోలీసు కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేశారు. అయినప్పటికీ తరచూ అక్రమాలు, చోరీలు జరగడంపై భక్తులు ఆందోళన చెందుతున్నారు. – ఆరు నెలల కిందట శ్రీనివాసచారి అనే సీనియర్ సహాయకుడు దుకాణాల టెండరు లీజుకు సంబంధించి రూ.52 లక్షలను పలువురు వ్యాపారుల నుంచి వసూలు చేసి ఆలయ ఖాతాలో జమచేయకుండా సొంతానికి వాడుకున్నట్లు అధికారుల విచారణలో తేలడంతో అతడిని సస్పెండ్ చేయడంతోపాటు ఈవో ఫిర్యాదు మేరకు మల్యాల ఠాణాలో కేసు కూడా నమోదు చేశారు. ఈ వ్యవహారంలో గతంలో పనిచేసిన ఈవోను సస్పెండ్ చేయగా మరో ఇద్దరు సూపరింటెండెంట్లకు మెమోలు జారీ చేశారు. సీనియర్ సహాయకుడు ఆలయ నిధులను దుర్వినియోగం చేసినట్లు అధికారులు 8 నెలల తర్వాత గుర్తించడం నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది.

దాదాపు ఐదు నెలల కిందట ప్రసాదం తయారీ కేంద్రంలో 20 ఏళ్లుగా పనిచేసిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి హుండీ లెక్కింపు సమయంలో రూ.11,010 తస్కరించి పట్టుబడటంతో ఉద్యోగం నుంచి తొలగించారు.

జయంతి ఉత్సవాల సమయంలో చేయని పనులకు ఇంజినీరింగు విభాగంలో కొందరు అధికారులు రూ.లక్షల్లో ఆలయ నిధులను స్వాహా చేసినట్లు ఆరోపణలున్నాయి. గతంలో పలు రకాల ఆర్జిత సేవలకు సంబంధించిన టికెట్లను కూడా రీఇష్యూ చేసిన సంఘటనలున్నాయి. కొండపైన జరిగే పలు టెండర్లలో నాయకులు, గుత్తేదార్లు కుమ్మక్కై అంజన్న సొమ్మును కాజేస్తున్నారు. ఆలయంలో జరుగుతున్న అక్రమ వసూళ్లపై పలుమార్లు భక్తులు అధికారులకు ఫిర్యాదు చేసినా సిబ్బంది తీరు మారడంలేదు. కొండగట్టులో ఇంటి దొంగల ఆటకట్టించి ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దాదాపు ఏడాది కిందట ఆలయ పాలకవర్గంలోని ప్రముఖ వ్యక్తి హుండీ లెక్కింపు సమయంలో బంగారు ఆభరణం తస్కరించినట్లు సీసీ కెమెరాలో నమోదు కావడంతో స్థానిక నాయకులు దేవాదాయశాఖ కమిషనరుకు ఫిర్యాదు చేయడంతో అతడిని పదవి నుంచి సస్పెండ్ చేసినప్పటికీ కోర్టు స్టే ఉత్తర్వుల ద్వారా కొనసాగుతున్నారు.

కఠిన చర్యలు – రామకృష్ణారావు, ఈవో

కొండగట్టు ఆలయంలో విధులు నిర్వహించే ఉద్యోగులు అక్రమాలు, అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు లోబడి ఉద్యోగులు పనిచేయాలి. అన్నదాన సత్రంలో బియ్యం, సరకులు మాయం చేసిన జూనియర్ సహాయకుడిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సస్పెన్షన్ కూడా చేస్తాం. కొండగట్టులో ఆయా విభాగాల సిబ్బంది పనితీరుపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుంది.

## అవార్డులు సరే... ప్రోత్సాహక నిధులేవి?



వేములవాడ: గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆధునిక వైద్య సేవలందిస్తూ మంచి గుర్తింపు పొందింది. వైద్యులు కూడా వివిధ రకాల శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. మరోవైపు రోజూ వచ్చే రోగుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. వీటన్నింటి ఫలితంగా వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి రాష్ట్ర స్థాయిలో మూడేళ్లుగా ప్రతిష్ఠాత్మక కాయకల్ప అవార్డును సొంతం చేసుకుంది. రాష్ట్రంలో దాదాపు వంద ఆసుపత్రులు ఉండగా మూడంచెల విధానంలో ఏటా ఈ అవార్డును సొంతం చేసుకోవడం గమనార్హం. అయితే ఈ అవార్డుకు సంబంధించిన నిధులు రాకపోవడం సిబ్బందిని నిరుత్సాహపరుస్తుంది.

వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిని ఆధునిక హంగులతో నిర్మించారు. వంద పడకలు ఉన్న ఈ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలతో రోగులకు వైద్య సేవలందిస్తున్నారు.

సాధారణ శస్త్రచికిత్సలతోపాటు నేత్ర, ఆర్థో, మోకీళ్ల మార్పిడి, కాన్పులు, గర్భ సంచిలో గడ్డల తొలగింపు తదితర శస్త్ర చికిత్సలు రోజూ జరుగుతుంటాయి.

సెప్టెంబరు 6న 24 గంటల్లో 23 వివిధ శస్త్ర చికిత్సలు నిర్వహించి ఆసుపత్రి వైద్యులు రికార్డు నెలకొల్పారు.

ఐపీ నెలకు దాదాపు 10 వేల వరకు ఉంటుంది. ఆసుపత్రి అభివృద్ధికి ఉపయోగపడతాయి

ఆసుపత్రి ఏటా కాయకల్ప అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది. కానీ అవార్డుకు ప్రకటించిన ప్రోత్సాహక నిధులు మాత్రం రావడం లేదు. నిధులు విడుదలైతే ఆసుపత్రిలో అభివృద్ధి పనులకు ఉపయోగించేందుకు అవకాశం ఉంది.

– సంతోష్‌చారి, పర్యవేక్షకుడు, వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి

ఎంపిక విధానం ఇలా...

కాయకల్ప అవార్డు ఎంపికకు బృందం సభ్యులు మూడంచెల విధానంలో పరిశీలిస్తారు.

ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, పరిసరాల నిర్వహణ, పరిశుభ్రత, వ్యర్థాల సేకరణ, సిబ్బంది పని తీరు, విద్యుత్తు వినియోగం, పచ్చదనానికి ప్రాధాన్యం వంటి అంశాలను పరిశీలనకు తీసుకుని మార్కులు వేసి నివేదిక ఇస్తారు. ఈ నివేదిక ఆధారంగా అవార్డుకు ఎంపిక చేస్తారు.

వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిని జులై 26న రాష్ట్ర బృందం తనిఖీ చేసింది. ఈ తనిఖీల్లో వచ్చిన మార్కుల ఆధారంగా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది.

అవార్డుకు ఎంపిక కావడంతో నగదు ప్రోత్సాహకం రూ.15 లక్షలు ప్రకటించింది.

మూడేళ్లుగా కాయకల్ప అవార్డుకు ఎంపికైనా ప్రభుత్వం ప్రకటించిన నిధులు మాత్రం రావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం విడుదల చేయాలని పలువురు కోరుతున్నారు.

## పడకలు.. పరికరాలు.. ప్లాంటు ఎప్పుడో?

ధర్మపురి: ఓ వైపు ప్రముఖ పుణ్యక్షేత్రం, మరోవైపు నియోజకవర్గ కేంద్రం కావడంతో.. ప్రభుత్వం ధర్మపురిలో అత్యాధునిక వైద్య సేవలందించేందుకు ప్రాధాన్యత ఇస్తుంది. అయితే ఆసుపత్రిలోని సేవలపై నిఘా లేకపోవడంతో సిబ్బంది మొక్కుబడిగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తనిఖీలు చేసినా.. మార్పు లేదు. ప్రభుత్వం మాతాశిశు కేంద్రం నిర్మించినా.. వైద్యులు, సిబ్బందిని నియమించకపోవడంతో సేవలు అందుబాటులోకి రాలేదు.

20 మంది మాత్రమే విధుల్లో..

ఇక్కడి సామాజిక ఆసుపత్రిలో గతేడాది 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినా.. అత్యవసర సేవలు ఏమాత్రం ఉండటం లేదు. కుక్కకాటు, కోతులు దాడిచేసినా.. జగిత్యాల ఏరియా ఆసుపత్రికి వెళ్తున్నారు. కనీసం ఎక్స్‌రేప్లాంటు, గర్భిణుల పరీక్షలకు సంబంధించిన పరికరాలు లేవని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ వైద్యులతో కలిసి 53మంది పనిచేయాల్సి ఉండగా.. 20 మంది మాత్రమే విధుల్లో ఉంటున్నట్లు చెబుతున్నారు.

పనిచేయని ఆక్సిజన్ ప్లాంటు..

రూ.కోటి వ్యయంతో నిర్మిస్తున్న ఆసుపత్రి మూడో అంతస్తు భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కరోనా సమయంలో సుమారు రూ.కోటి వ్యయంతో ఏర్పాటుచేసిన ఆక్సిజన్ ప్లాంటును గతేడాది ప్రారంభించినా.. సాంకేతిక లోపంతో పనిచేయడంలేదు. ఈ ఆసుపత్రి పరిధిలో ధర్మపురి, వెల్గటూర్, బుగ్గారం, బీర్‌పూర్ మండలాలుండగా.. నిత్యం 150 మంది ఓపీ రోగులు వస్తుంటారు. నేటికీ ప్రతిపాదనల్లోనే..గతేడాది 10 ఐసీయూ బెడ్ల ప్లాంటును ధర్మపురి ఆసుపత్రికి మంజూరు చేశారు. ఇది ప్రతిపాదనల్లోనే ఉంది. రోగులకు రోజూ అందించే భోజనం నాసిరకంగానే ఉంటోందని రోగులు వాపోతున్నారు. పారిశుద్ధ్యం కూడా అధ్వాన్నంగానే ఉంటోందని..



మధ్యాహ్నం వేళ వైద్యులు అందుబాటులో ఉండటంలేదని బాధితులు చెబుతున్నారు. ఆసుపత్రి సేవలపై ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అందని మాతాశిశు కేంద్రం సేవలు..ధర్మపురిలో గత ప్రభుత్వ హయాంలో రూ.8.50 కోట్లతో నిర్మించిన మాతాశిశు ఆసుపత్రి కేంద్ర భవన సేవలు అందుబాటులోకి రాలేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆదరబాదరాగా అక్టోబర్‌లో అప్పటి మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్ ప్రారంభించారు. రెండు నెలల్లో మిగతా పనులు పూర్తిచేసి సేవలను అందుబాటులోకి తీసుకుని వస్తామని ప్రకటించినా.. ఇప్పటివరకు అతీగతి లేదు.ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం..ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలందించేందుకు కృషిచేస్తాం. ప్రస్తుతం వైద్యుల కొరత అంతగా లేదు. సిబ్బందిని కూడా నియమించాం. పరికరాల కోసం ప్రతిపాదనలు పంపించాం. వైద్యులు నిర్ణీత సమయం ప్రకారం ఉండేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఐసీయూ కేంద్రానికి కావాల్సిన పరికరాలు రావాల్సి ఉంది. మాతాశిశు ఆసుపత్రికి సిబ్బందిని నియమించలేదు. దీనిపై ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళుతాం.– డా.రామక్రిష్ణ, జిల్లా వైద్యవిధాన పరిషత్, సమన్వయకర్త

## కొందరిపైనే పని భారం!

సూర్యాపేట : జిల్లాలో గ్రామ పంచాయతీల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఇప్పటికే సర్పంచుల పదవీకాలం ముగిసింది. దీనికితోడు ఆగస్టులో పంచాయతీ కార్యదర్శుల బదిలీలు జరిగాయి. కొత్తవారికి ఆయా పంచాయతీలపై అవగాహన లేదు. ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నా.. పంచాయతీల పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. కొన్ని గ్రామాలకు ఇన్‌ఛార్జి కార్యదర్శులు బాధ్యత వహిస్తున్నారు. వాటిల్లో పారిశుద్ధ్య, ఇతర సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇన్‌ఛార్జిల పాలన..జిల్లా వ్యాప్తంగా 475 గ్రామ పంచాయతీలున్నాయి. అన్నింటిలోనూ కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో 180 మంది స్థాన చలనం కలిగింది. బదిలీల సమయంలో కొన్ని గ్రామ పంచాయతీలు ఎంపిక చేసుకునేందుకు అవకాశం కల్పించకపోవడంతో ఈ విషయమై అప్పుడే జిల్లా పాలనాధికారి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే పరిష్కరించారు. అప్పటికే జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పంచాయతీలను ఎంపిక చేసుకున్నారు. కొందరికి ఆయా గ్రామాలకు వెళ్లేందుకు ఇష్టం లేదు. కొందరు అనారోగ్యం,



ఇతర ఉద్యోగాలకు సిద్ధమయ్యేందుకు, ఇలా వివిధ కారణాలతో జిల్లాలో 62 మంది కార్యదర్శులు సెలవుపై వెళ్లారు. దీంతో పని చేస్తున్న వారిపైనే భారం పడుతోంది. అందులో దాదాపు 20 మంది వరకు పని చేసేందుకు ఆసక్తి ఉందని, ఆ స్థానం నుంచి వేరే ప్రాంతానికి బదిలీ చేస్తే వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపినట్లు సమాచారం. అధికారులు స్పందించి బదిలీ చేస్తే పని ఒత్తిడి తగ్గుతుంది.

పాలనాధికారి చెప్పినా! పంచాయతీల్లో సెలవుల్లో ఉన్న ఉద్యోగుల వివరాలపై జిల్లా పాలనాధికారి ఇప్పటికే ఆరా తీసినట్లు సమాచారం. బదిలీలు అవసరమున్న వారికి వారు కోరుకునే స్థానాలకు వెళ్లేందుకు సుముఖంగా ఉన్న వారిని బదిలీ చేసేలా సన్నాహాలు చేయాలని సంబంధిత శాఖ అధికారికి నెల క్రితమే తెలియజేసినట్లు తెలిసింది. సదరు అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులకు నివేదిస్తాం: నారాయణరెడ్డి, డీపీవో, సూర్యాపేట


జిల్లాలో వివిధ కారణాలతో కార్యదర్శులు సెలవు పెట్టిన విషయం వాస్తవమే. కొందరు ఆయా గ్రామాలకు వెళ్లేందుకు సుముఖంగా లేని వారి వివరాలు తెలుసుకున్నాం. వారి బదిలీ విషయమై ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల వివరాలు

మొత్తం కార్యదర్శులు : 475 ఓపీఎస్‌లు : 51 గ్రేడ్-2 : 288 జేపీఎస్ : 136 సెలవుల్లో ఉన్న వారు: 62 బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న వారు : 24

## కొత్త ఉపాధ్యాయులు వస్తున్నారు..!

నల్గొండ : సర్కారు బడులకు కొత్త ఉపాధ్యాయులు వచ్చి పాఠం చెప్పనున్నారు. డీఎస్సీ-2024 ద్వారా ఉపాధ్యాయ కొలువులకు ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లో ఉత్తర్వులు అందుకున్న అభ్యర్థులకు కౌన్సెలింగ్ ద్వారా పాఠశాల కేటాయించనున్నారు. కొత్తవారి రాక సర్కారు బడుల్లో కొంత మేర ఉపాధ్యాయుల కొరత తీరనుంది. నల్గొండ జిల్లాలో 605, సూర్యాపేట జిల్లాలో 386, యాదాద్రి భువనగిరి జిల్లాలో 277 ఖాళీలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీచేసింది. ఫలితాలు వెలువడిన తర్వాత ధ్రువపత్రాలు పరిశీలించి 1:1 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేశారు. వీరికి హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. దసరాకు ముందు కొలువుల ఉత్తర్వులు పొందినా ఎక్కడ పోస్టింగ్ అనే విషయం కొలిక్కిరాలేదు. పోస్టింగ్ కోసం జిల్లా విద్యాశాఖ మంగళవారం



ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించనుంది.

ప్రాథమిక పాఠశాలలకు ఊరట ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలలకు కాస్త ఊరట కలగనుంది. ఇటీవల పదోన్నతులు, బదిలీలు చేపట్టిన తరువాత ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీల కొరత కాస్త ఎక్కువగా ఉంది. బదిలీ జరిగిందని సంతోషం ఉన్నా అక్కడ ఉపాధ్యాయులు లేక కొన్నిచోట్ల రిలీవర్‌లు లేక అదే స్థానంలో కొనసాగుతున్నారు. తాజాగా కొత్త ఉపాధ్యాయుల నియామకం అవుతుండటంతో అలాంటి వారికి కాస్త ఉపశమనం కలుగనుంది.

అభ్యర్థులందరూ హాజరుకావాలి : భిక్షపతి, డీఈవో, నల్గొండ

డీఎస్సీ-2024లో ఎంపికయి, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో రిపోర్టు చేసిన అభ్యర్థులందరికీ ఈ నెల 15న (మంగళవారం) ఉదయం 10 గంటల నుంచి నల్గొండలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. అభ్యర్థులందరూ రెండు తాజా పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, వాస్తవ ధ్రువపత్రాలతో హాజరుకావాలి. బదిలీ అయిన ఉపాధ్యాయులు కొంత మంది అదే పాఠశాలలో కొనసాగుతూ విధులు నిర్వహిస్తున్నారు. వారు మంగళవారం సాయంత్రం విధుల నుంచి విడుదలై 16వ తేదీన బదిలీ స్థానంలో రిపోర్టు చేయాలి.

# తుది దశకు సర్వే

భువనగిరి : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, కుల సమగ్ర కుటుంబ సర్వే రెండో అంకం జిల్లాలో తుది దశకు చేరుకుంది. సర్వే నిర్వహించడంలో జిల్లా రాష్ట్రస్థాయిలో ఐదో స్థానంలో నిలిచింది. 2,47,354 గృహాలు ఉన్నట్లుగా తొలుత అధికారులు అంచనా వేసి 1,910 మంది ఎన్యుమరేటర్లను నియమించారు. స్టిక్కరింగ్‌లో 2,60,559 గృహాలు ఉన్నట్లుగా తేలింది. గురువారం నాటికి 2,40,381 ఇళ్లలో వివరాలు సేకరించగా దాదాపు 92శాతం సర్వే పూర్తయ్యింది.

**జరిగింది ఇలా..**

తొలి విడతగా ఈ నెల 6, 7, 8 తేదీల్లో ఎన్యుమరేటర్లు ఇంటింటికి గృహాలను గుర్తించి స్టిక్కరింగ్ చేశారు. 9వ తేదీని నుంచి 75 అంశాలపై వివరాలు సేకరించే అసలు సర్వే ప్రారంభమైంది. కలెక్టర్ వి.హనుమంతరావు పర్యవేక్షణలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్ నోడల్ అధికారిగా ప్రక్రియ పకడ్బందీగా కొనసాగింది. తొలి రెండు రోజుల్లో కొంత ఆలస్యంగా జరిగినా తదుపరి పుంజుకుంది. ఒక్కో ఎన్యుమరేటర్‌కు 100 నుంచి 150 వరకు ఇళ్లను కేటాయించారు. 198 మంది సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో సర్వే కొనసాగింది. కలెక్టర్, అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, గంగాధర్‌లు దాదాపు జిల్లాలోని రోజు ఏదో గ్రామానికి వెళ్లి క్షేత్ర స్థాయిలో నిశితంగా గమనించి వారికి సూచనలు ఇస్తూ వచ్చారు.

కొందరు ఇళ్లలో లేకపోవడం, ఇళ్లకు తాళాలు వేసి ఉండటంతో మరో విడత వారి ఇళ్ల వద్దకు వెళ్లి సర్వే చేసేందుకు ఎన్యుమరేటర్లు సిద్ధమవుతున్నారు. క్షేత్రస్థాయిలో గణకులకు ఇబ్బందులు కూడా



ఎదురయ్యాయి. 75 అంశాలు ఉండటంలో, వాటిలో ఆస్తులకు సంబంధించిన వివరాలను తెలిపేందుకు కొందరు నిరాకరించారు. బ్యాంకు ఖాతాలు కూడా చెప్పలేదు. ఆధార్, రేషన్ కార్డు, పట్టాదార్ పాస్‌పుస్తకాలను తమ వద్ద ఉంచుకుని ఎన్యుమరేటర్లు వచ్చినప్పుడు చూపించాలని కోరినా.. చాలా మంది స్పందించలేదు. తమకు అందే పథకాలు పోతాయేమోనన్న భయంతో పక్కా సమాచారం ఇవ్వలేదని తెలిసింది. ప్రజలు చెప్పిన సమాచారం రాసుకోవాలని ప్రభుత్వం చెప్పడంతో ఎన్యుమరేటర్లు కూడా ఒత్తిడి చేయలేకపోయారు. సర్వే పత్రంలో ముందుగా వివరాలను పెన్సిల్‌తో రాసుకుని ఆ తర్వాత పెన్నుతో పూర్తి చేశారు.

**రోజుకు 25 దరఖాస్తులు మాత్రమే**

సర్వే పూర్తి కావడంతో ఎన్యుమరేటర్లు ఇచ్చిన పత్రాలను పరిశీలించి కంప్యూటరీకరణ చేసేందుకు యంత్రాంగం సిద్ధమవుతోంది. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో శిక్షణ ఇచ్చారు. సుమారు 600 మంది హాజరయ్యారు. ఒక్కో ఆపరేటర్ రోజుకు 25 వరకు ఫారాలను మాత్రమే ఎంట్రీ చేయాల్సి ఉంటుంది.

**వివరాల నమోదుకు సిద్ధమవుతున్నాం** కె.గంగాధర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, సర్వే నోడల్ అధికారి జిల్లాలో సర్వే 92.38 శాతం పూర్తయ్యింది. మిగిలింది రెండు రోజుల్లో పూర్తి చేస్తాం. డేటా ఎంట్రీని పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. డేటా నమోదుకు సంబంధించి డెమో సాఫ్ట్‌వేర్ మాత్రమే వచ్చింది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే నమోదు ప్రక్రియ ప్రారంభిస్తాం. వివరాల నమోదుకు 65 కేంద్రాలను ఎంపిక చేశాం.

# కొలువుల పొదరిల్లు

నీలగిరి : విద్య, ఉద్యోగాల కోసం గ్రంథాలయాలు అవసరమని వట్టికోట ఆల్వార్‌స్వామి వంటి వారు ఉద్యమాలు చేసి జిల్లాల్లో వీటి బలోపేతానికి కృషి చేశారు. ఆనాడు వారు వేసిన తొలి అడుగు నేడు ఎంతో మంది నిరుద్యోగులకు వరంగా మారింది. ప్రభుత్వం అందించే ప్రోత్సాహంతో పాటు దాతల సాయంతో నిరుద్యోగులు చదువుకొని ఉద్యోగాలు సాధిస్తున్నారు. ఏడాది కాలంగా జిల్లాలోని ప్రధాన గ్రంథాలయాల్లో చదువుకొని 200 మందికి పైగా నిరుద్యోగులు వివిధ శాఖల్లో ఉద్యోగాలు సాధించారు.

జిల్లాలో 33 గ్రంథాలయాలు ఉన్నాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు మహిళా గ్రంథాలయం ఉంది. అన్ని రకాల పోటీ పరీక్షలకు అవసరం అయిన పుస్తకాలు , దినపత్రికలు అందుబాటులో ఉన్నాయి. పోటీ పరీక్షలకు అవసరం అయ్యే పుస్తకాలు అందజేసేందుకు జిల్లా కేంద్రంలో ప్రతీక్ ఫౌండేషన్ ముందుకు వచ్చింది. అంతేకాకుండా నిరుద్యోగులకు మధ్యాహ్న భోజనం కూడా అందజేస్తోంది. జిల్లా కేంద్రంతో పాటు మిర్యాలగూడ, దేవరకొండ, నాగార్జునసాగర్, నకిరేకల్, మునుగోడు, చండూరు తదితర ప్రాంతాల్లోని గ్రంథాలయాల్లో నిరుద్యోగులు చదువుకుని ఉద్యోగాలు సాధించారు.



**అన్ని సౌకర్యాలు ఉన్నాయి. - బాలమ్మ, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి**

గ్రంథాలయాల్లో పాఠకులకు, నిరుద్యోగులకు అవసరం ఉన్న అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. నిరుద్యోగులకు అవసరం అయిన పుస్తకాలు, జర్నల్స్ అందుబాటులో ఉంచాం. తాగునీరు, మూత్రశాలలు, రీడింగ్ హాళ్లు, ఏర్పాటు చేశాం. ప్రతీక్ ఫౌండేషన్ వారు ఉచితంగా మధ్యాహ్న భోజనం అందజేస్తున్నారు.

**స్థోమత లేక... - రామరాజు యాదవ్, జూనియర్ కళాశాల అధ్యాపకుడు**

ఉద్యోగం కోసం వేలకు వేలు ఖర్చు పెట్టి ప్రైవేట్‌లో శిక్షణ పొందే ఆర్థిక స్థోమత లేక గ్రంథాలయంలో పుస్తకాలు చదివి జూనియర్ కళాశాల అధ్యాపకునిగా ఉద్యోగం సాధించాను. ఉన్న పుస్తకాలను ఏకాగ్రతతో చదివాను.

**పేదలకు వరం- శ్వేత, జూనియర్ అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ**

పుస్తకాలు కొనలేని స్థితిలో గ్రంథాలయం దారి చూపింది. అందుబాటులో ఉన్న పుస్తకాలతో పాటు అవసరం ఉన్నవి కావాలని అధికారులకు చెప్పి తెప్పించుకున్నాం. కష్టపడి చదివి ఉద్యోగం సాధించాను. మాలాంటి వారికి గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి.

# హైదరాబాద్‌లో మెట్రో నుంచి ప్రైవేట్ మాల్స్‌కు స్కైవాక్



హైదరాబాద్ : హైదరాబాద్ మెట్రోరైలు స్టేషన్ల నుంచి సమీపంలోని మెట్రో మాల్స్ వరకు మాత్రమే ఇప్పటివరకు స్కైవాక్స్ పరిమితం. మొదటిసారి ప్రైవేటు మాల్‌కు స్కైవేతో అనుసంధానం చేపట్టారు. కూకట్‌పల్లి వై జంక్షన్‌లో నిర్మిస్తున్న ఒక బడా మాల్‌కు ఆకాశవంతెనతో అనుసంధానం చేశారు. ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ, హెచ్ఎంఆర్ అనుమతి ఇవ్వడంతో సదరు మాల్ నిర్మాణం చేపట్టిన సంస్థనే ఈ వంతెనను స్టేషన్ నుంచి నేరుగా తమ మాల్ వరకు నిర్మించుకుంటోంది. మెట్రోరైలు రాకతో రవాణా అధారిత అభివృద్ధిలో భాగంగా నగరంలో సరికొత్త మార్పులు గత కొన్నేళ్లుగా కనిపిస్తున్నాయి. మెట్రో స్టేషన్ నుంచి రహదారిపైకి రావాల్సిన అవసరం లేకుండా నేరుగా సమీపంలోని మాల్స్‌కి స్కైవాక్ ద్వారా వెళ్లే ఏర్పాట్లు చేశారు. మాదాపూర్, పంజాగుట్టలో ఈ తరహా సదుపాయం ఉంది. షాపింగ్, డైనింగ్, సినిమాలు చూసి సరదాగా కాసేపు కాలక్షేపం చేసి తిరిగి మెట్రోలో వెళ్లిపోయేలా డిజైన్ చేశారు. రహదారిపై పాదచారులకు నడిచేందుకు సరైన పాదబాటలు లేకపోవడంతో స్కైవాక్స్ సౌకర్యంగా ఉన్నాయని ప్రయాణికులు అంటున్నారు. ఎక్కువ మంది వినియోగిస్తున్నారు. ప్రభుత్వం ముందుకొచ్చి ఉప్పల్ కూడలిలోనూ స్కైవాక్ చేపట్టడంతో బాగా ప్రాచుర్యం పొందింది.

**ఎవరు ముందుకొచ్చినా ఇచ్చేలా..**

తొలుత స్కైవాక్ సౌలభ్యం అందరికీ తెలియజేసేందుకు ఎల్ అండ్ టీ సంస్థ నిర్మించిన మాల్స్‌కు అనుసంధానం చేశారు. మెట్రో మార్గాల వెంట ఇతర ప్రైవేటు మాల్స్, కార్యాలయాలు ముందుకొస్తే వారి భవనాలకు అనుసంధానించేందుకు అవకాశమిస్తామని హైదరాబాద్ మెట్రోరైలు గతంలో ప్రకటించింది. దీంతో మాదాపూర్‌లో రహేజా మైండ్‌స్పేస్ ముందుకొచ్చింది. మెట్రో స్టేషన్ నుంచి ఐటీ పార్క్‌ను కలిపేలా ఆకాశ వంతెన నిర్మించారు. ఇప్పుడు కూకట్‌పల్లి వై జంక్షన్‌లో అతిపెద్ద మాల్ నిర్మిస్తున్న సంస్థ రావడంతో అక్కడ అవకాశం కల్పించారు. ఈ తరహాలో స్కైవాక్ అనుసంధానం చేసే మొదటి మాల్ ఇదే. వచ్చే ఏడాది ఈ మాల్‌ని, స్కైవాక్‌ని ప్రారంభించేందుకు సదరు సంస్థ ఏర్పాట్లు చేస్తోంది.

# మానవత్వం చేతల్లో చూపుదాం!



కరీంనగర్ : కీసర- నాగారం రోడ్డుపై నుజ్జునుజ్జయిన కాళ్లతో ఆర్తనాదాలు చేస్తూ.. 'కాపాడండి.. అంటూ నెత్తురోడుతున్న చేతులతోనే' వేడుకున్న క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించాలన్న ఆలోచనే ఎవరికి రాలేదు. 108కు ఫోన్ చేసి ఆయనను చరవాణిల్లో వీడియో తీస్తూ గడిపారు. అంబులెన్సు వచ్చాక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లా కేంద్రంలో కన్నతల్లి కళ్ల ముందే యువకుడిని ట్రాక్టరు ఢీకొంది. తీవ్రగాయాలైన కొడుకును ఆస్పత్రికి తీసుకెళ్లడానికి ఆ మాతృమూర్తి ప్రయత్నించినా ఆమె వల్ల కాలేదు. దారిన వెళ్లే వారిని సాయమందించమన్నా ఎవరూ ముందుకు రాలేదు. 108కు ఫోన్ చేసి చరవాణిలో ఫొటోలు తీయడానికి పరిమితమయ్యారు. ఆలస్యంగా ఆస్పత్రికి తరలించడంతో ఆ యువకుడు మృతి చెందాడు.

**ఇలా చేస్తే..** ఈ నెల 11న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ వరంగల్ వైపునకు వెళ్తుండగా హుజూరాబాద్ సమీపంలో లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఓ మహిళ లారీ కింద ఇరుక్కుపోయింది. మంత్రి సకాలంలో స్పందించి సిబ్బంది, స్థానికుల సాయంతో అప్పటికప్పుడు చక్రం ఇరుసులో ఇరుక్కున్న మహిళ జుత్తును కత్తిరించి.. మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఆ మహిళ ప్రాణాలతో బయటపడింది.

ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అయ్యో పాపం అనుకోని వారుండరు.. సాయం చేయాల్సి వచ్చేసరికి మాత్రం వెనకడుగు వేస్తున్నారు. క్షతగాత్రుల దయనీయ స్థితిని చరవాణిలో బంధించి సామాజిక మాధ్యమాల్లో ఉంచడానికి చూపుతున్న శ్రద్ధ వారిని కాపాడటంపై పెట్టడం లేదు.. మనం ఆ పరిస్థితిలో ఉంటే ఎలా? అని ఒక్కసారి ఆలోచిస్తే సాయం చేయడానికి కదులుతాం.. ప్రాణాలను కాపాడగలుగుతాం..

**అవగాహన లేక..**

ఆపత్కాలంలో ఎలా స్పందించాలనే తీరుపై ఉమ్మడి జిల్లాలో అవగాహన సమావేశాలు, చైతన్య కార్యక్రమాలు కొన్నేళ్లుగా నిర్వహించడం లేదు. ప్రతి మూడు నెలలకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై సమీక్షలు నిర్వహించాల్సి ఉన్నా.. జరగడం లేదు. చాలామంది ఠాణాలు, కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందేమో అన్న అనుమానంతో సాయం చేయడానికి ముందుకు రావడం లేదు.

**అందుబాటులో లేకుంటే..**

ఉమ్మడి జిల్లాలో 46 వాహనాలు సేవలందిస్తున్నాయి. ప్రమాదాలతోపాటు గర్భిణుల తరలింపు, ఆరోగ్య సమస్యలకు వీటిని ఉపయోగించుకుంటున్నారు. ప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న 10-15 నిమిషాల వ్యవధిలో 108 వాహనం అక్కడికి చేరుకోవాలి. ఆ సమయంలో వేరే కేసుల్లో ఉంటే ఆలస్యమవుతోంది. గత నెలలో ఉమ్మడి జిల్లాలో ఈ వాహనాలు 5,809 మందిని ఆస్పత్రులకు తరలించి సేవల్లో ముందున్నా.. ఒకేసారి ఫోన్లు వస్తే ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**అధికారులు ఇలా చేస్తే మేలు..!**

రక్తదానం చేస్తున్న వారిని ప్రోత్సహిస్తున్నట్లుగానే క్షతగాత్రులను వేగంగా ఆస్పత్రికి తరలించిన వారిని అధికారులు సత్కరిస్తూ ప్రోత్సహించాలి. 108 సిబ్బంది తక్షణ స్పందనతో ప్రాణాలు నిలబెడుతున్న తీరును గుర్తించి ప్రశంసించాలి.

ప్రమాద సమయాల్లో స్పందిస్తే కేసుల పేరిట ఇబ్బందులు పెట్టబోమని పోలీసులు అవగాహన కల్పించాలి.

**గోల్డెన్ అవర్ అంటే..**

ప్రమాదం జరిగిన గంటలోపే క్షతగాత్రుడికి చికిత్స అందిస్తే ప్రాణాపాయం తప్పే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అందుకే మొదటి గంటను గోల్డెన్ అవర్ అంటారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల జరుగుతున్న ప్రమాదాల్లో 63 శాతం మంది రోడ్డుపై గాయపడిన గంట వ్యవధిలో చికిత్స అందకపోవడం వల్లనే చనిపోతున్నట్లు కొన్ని సర్వేల్లో తేలింది.

**ప్రతి నిమిషం అమూల్యం**-కె.కిషోర్‌కుమార్, జనరల్ ఫిజీషియన్, కరీంనగర్

ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడినప్పుడు ప్రతి నిమిషం కీలకంగా మారుతుంది. రక్తస్రావం వీలైనంత తక్కువయ్యే విధంగా చూడాలి. తీవ్ర రక్తస్రావమైనప్పుడు ఇతర అవయవాలకు సరఫరా నిలిచిపోయి కోమాలోకి వెళ్లే అవకాశం ఉంటుంది. ప్రమాదం జరిగిన గంటలోపు ఆస్పత్రికి తీసుకెళ్తే బతికించే అవకాశాలు ఎక్కువ. పెద్దాసుపత్రికి తీసుకెళ్లాలనే తపన కన్నా.. ముందుగా ప్రాథమిక వైద్యం అందించగలగాలి. వ్యక్తి స్పృహలో లేనప్పుడు నీళ్లు తాగించొద్దు.

# సేంద్రియ ఎరువు.. తయారీ కరవు



జగిత్యాల : చెత్తను ఎక్కడికక్కడే తగ్గించాలనే ప్రభుత్వ ఆదేశాలు ఆచరణలో సాధ్యం కావడం లేదు. ఇంటి నుంచి రెండు రకాల చెత్తను ఆటో కార్మికులకు సేకరిస్తుండగా.. కూరగాయల మార్కెట్ నుంచి వచ్చే కుళ్లిన కూరగాయలు తీసుకెళ్తున్నారు.. ఇదంతా ఎక్కడికి తరలిస్తున్నారంటే అర్థం కాని పరిస్థితి నెలకొంది. కంపోస్టు యార్డులు సైతం ఖాళీగానే ఉన్నాయి.

షెడ్లు ఖాళీగానే దర్శనం నగరంలో ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఉన్న వర్మీ కంపోస్టు యార్డులో కొద్దిపాటి కూరగాయలు ఉన్నాయి. మిగతా బెడ్స్ ఖాళీగానే ఉన్నాయి. ఉన్న వాటిలో నిర్వహణ లేకపోవడంతో వానపాములు చనిపోయే పరిస్థితి ఏర్పడింది. హౌసింగ్‌బోర్డుకాలనీలోని రీసోర్స్ పార్కు చెత్తా చెదారంతో దర్శనమిస్తోంది. కంపోస్టు యార్డులకు వెళ్లకుండా కుళ్లిన పూలు, ఇతర వ్యర్థాలను అడ్డుగా పోయడంతో తడి చెత్త ఎలా వేయాలో తెలియకుండా మారింది. అంగడి రైతుబజారులో కుళ్లిన కూరగాయలు కంపోస్టు కేంద్రంలో వేయకుండా పశువులకు వేస్తున్నారు. దీన్ని చెత్తతో నింపుతున్నారు.

ప్రతిరోజు 10 మెట్రిక్ టన్నులు సేకరించాల్సి ఉండగా ఒక టన్ను కూడా సేంద్రియ ఎరువుకు వినియోగించుకోవడం లేదు.

మరోవైపు గతంలో బైపాసు రహదారుల్లో చెత్త వేయాలంటే ప్రజలు, ఆటో కార్మికులు, ఇతరులు భయపడే వారు. కార్మికులతో నిఘా ఉంచి ఏ సమయంలో చెత్త వేస్తున్నారో గుర్తించి, ఆ సమయంలో రహస్యంగా ఉండి వారిని పట్టుకొని జరిమానా విధించే వారు.

మారుతీనగర్ పడవ జంక్షన్ నుంచి తీగల వంతెనకు వెళ్లే బైపాసు, రామగుండం బైపాసు, గౌతమినగర్ బైపాసులలో అనధికారికంగా డంపింగ్‌యార్డు తయారవుతోంది.

విద్యానగర్ నుంచి చింతకుంట వైపు రోడ్డు మీదనే చెత్తాచెదారం పడేస్తుండటంతో పరిసరాలు కలుషితం అవుతున్నాయి.

తడి చెత్త మాటేమిటి?

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో తడి, పొడి చెత్త సేకరణ భారంగా మారింది. రెండు రకాల చెత్తను వేరు చేసి తరలించాల్సి ఉండగా మొత్తం వ్యర్థాలు డంపింగ్‌యార్డుకే పంపిస్తున్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా తీసుకెళ్లేందుకు అవకాశమున్న క్షేత్రస్థాయిలో సరైన విధంగా అమలు కావడం లేదు. తడి చెత్తను వర్మీ కంపోస్టు కేంద్రాలకు, పొడి చెత్తను డ్రై రీసోర్స్ కలెక్షన్ సెంటర్ (డీఆర్‌సీసీ) కేంద్రానికి పంపించాలి. ఆదాయం వచ్చే పొడి చెత్త తగ్గుతుండగా మిగతాది డంపింగ్ యార్డుకు చేరవేస్తున్నారు. తడి చెత్తతో ఎరువు తయారీ చేయాల్సి ఉండగా ఎక్కడ కూడా అవి పని చేయడం లేదు.

చర్యలు తీసుకుంటాం- జె.సువార్త, అదనపు కమిషనర్, నగరపాలిక వర్మీ కంపోస్టు కేంద్రాలకు తడి చెత్త తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటున్నాం. ఒక్కో కేంద్రాన్ని ప్రత్యేకంగా తనిఖీ చేసి వసతులు కల్పించడం జరుగుతుంది. రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధిస్తాం.

# ఆలస్యం.. నిమిషం.. విషం..!

కోదాడ పట్టణంలోని ఓ పరీక్ష కేంద్రంలో ఈ నెల 18న గ్రూప్-3 మూడో పేపరు రాసేందుకు ఓ అభ్యర్థి నిమిషం ఆలస్యంగా వచ్చాడు. అధికారులు కేంద్రంలోకి పంపించలేదు. రెండు పేపర్లు రాశానని, మూడో పేపర్ రాస్తే ఉద్యోగం వచ్చే అవకాశం ఉందని అభ్యర్థి బతిమాలినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో కన్నీరు పెట్టుకొని పరీక్ష కేంద్రం నుంచి వెనుదిరిగాడు. నిమిషం ఆలస్యంతో జీవిత ఆశయానికి దూరమయ్యాడు. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో ఉండటం గమనార్హం..

ఆరుగాలం శ్రమించి పంట చేతికొచ్చే దశలో తుపాను ధాటికి పంట నష్టమైతే రైతుకు ఎంత దు:ఖం ఉంటుందో.. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా సంవత్సరాల పాటు రాత్రింబవళ్లు చదివి పరీక్ష కేంద్రానికి నిమిషం ఆలస్యంగా వెళ్లడంతో పరీక్ష రాయకపోతే అభ్యర్థి పరిస్థితి కూడా అలానే ఉంటుంది. సమయపాలన పాటించక నిర్లక్ష్యంతో కొందరు దూరమైతే, ప్రయాణంలో కలిగే అవాంతరాలతో మరికొందరు ఆలస్యమై వెనుదిరుగుతుంటారు. నెలల పాటు పుస్తకాలే లోకంగా చదివి నిమిషం ఆలస్యం కావడంతో పరీక్ష రాయని అభ్యర్థులను ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్-3 పరీక్ష కేంద్రాల వద్ద చూశాం. చదివేటప్పుడు ఉండే సహనం, ప్రణాళిక పరీక్ష కేంద్రాలకు వెళ్లేటప్పుడు ఉండకపోవడం ఆలోచించదగిన విషయం.



గ్రూప్-3 పరీక్షలు ఈ నెల 17న మొదలుకాగా మొదటి పేపర్ పరీక్ష రాసేందుకు జిల్లాల్లోని కోదాడ, సూర్యాపేట పట్టణాల్లోని సుమారు మూడు పరీక్ష కేంద్రాల్లో, ఒక్కో కేంద్రానికి నలుగురు అభ్యర్థులు నిర్ణీత సమయానికి రాలేదు. నిమిషం ఆలస్యంగా రావడంతో అధికారులు అనుమతించలేదు.

**ప్రణాళిక వేసుకోవాలి..**

**సాంకేతికత వినియోగించాలి..**

అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి వెళ్లాలంటే రవాణా పరంగా ఎన్నో మార్గాలు ఉన్నాయి. ఇప్పుడున్న ఆధునిక యుగంలో పరీక్ష కేంద్రం ఎక్కడ ఉందో చరవాణిలో ముందు గుర్తించవచ్చు. అభ్యర్థి ఉన్న చోటు నుంచి కేంద్రానికి వెళ్లాలంటే ఎంత సమయం పడుతుందో ఆన్‌లైన్‌లో చూడవచ్చు. ప్రతి ఒక్కరికీ ద్విచక్ర వాహనాలు అందుబాటులో ఉన్నాయి. పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకునేలా ప్రయాణం కొనసాగిస్తే మార్గమధ్యలో ఏమైనా అవాంతరాలు ఎదురైనా.. సరైనా సమయానికే పరీక్ష కేంద్రానికి వెళ్లొచ్చు. ఇప్పటికైనా అభ్యర్థులు రాబోయే రోజుల్లో రాసే ప్రతి పరీక్షకు గంట ముందుగానే ప్రణాళికలు వేసుకుంటే ఇలాంటి ఘటనలు పునరావృతం కావు. కోదాడ పట్టణంలోనే 10 మంది వరకు పరీక్ష కేంద్రాలకు ఆలస్యంగా వచ్చారంటే జిల్లా వ్యాప్తంగా ఆ సంఖ్య ఎంతో ఉంటుందో ఊహించొచ్చు.

**సమయ పాలన పాటించాలి**

**శ్రీధర్‌రెడ్డి, డీఎస్పీ కోదాడ**

పోటీ ప్రపంచంలో క్షణం కూడా ఎంతో విలువైంది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు సమయం ఎంత విలువైందో తెలుసు. నిత్యం ఏం చదవాలో ప్రతి అభ్యర్థి ప్రణాళిక రూపొందించుకోవాలి. పరీక్ష కేంద్రం ఎక్కడ ఉందో ముందు రోజే గుర్తించి, దానికి తగట్టు రవాణా సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలి.

# పామాయిల్ పరిశ్రమ నిర్మాణానికి పచ్చజెండా

అశ్వారావుపేట : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మూడో పామాయిల్ పరిశ్రమ నిర్మాణానికి టీజీ ఆయిల్‌ఫెడ్ శంకుస్థాపనకు రంగం సిద్ధం చేస్తోంది. ఖమ్మం జిల్లాలో తొలిపరిశ్రమగా వేంసూరు మండలం కల్లూరిగూడెంలో శంకుస్థాపనకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే అందుకు సంబంధించి ప్రాథమిక నివేదిక మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్ భాషా వద్ద సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం భద్రాద్రి జిల్లాలోని అశ్వారావుపేటలో 30టన్నులు, అప్పారావుపేటలో 90టన్నుల సామర్థ్యంతో పామాయిల్ పరిశ్రమలున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1.75లక్షల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగవుతుండగా.. అందులో సుమారు 80వేల ఎకరాలు భద్రాద్రి జిల్లాలో, 30వేల ఎకరాలు ఖమ్మం జిల్లాలో ఉన్నాయి. మిగిలిన జిల్లాల్లో మిగతా విస్తీర్ణం ఉంది. ప్రస్తుతం అశ్వారావుపేట, అప్పారావుపేట పామాయిల్ పరిశ్రమల్లో ఆయిల్‌పాం గెలలు క్రషింగ్ జరుగుతున్నాయి. సిద్దిపేటలో నిర్మాణంలో ఉన్న పామాయిల్ పరిశ్రమ 2026 ఆగస్టు నాటికి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే 30వేల ఎకరాల్లో ఆయిల్‌పాం విస్తీర్ణం ఉండి, ఏటా 70వేల టన్నుల ఆయిల్‌పాం గెలలు ఉత్పత్తి వస్తోంది. ఖమ్మం జిల్లాలో సుమారు 50వేల టన్నులు సత్తుపల్లి, వేంసూరు మండలాల నుంచే వస్తున్నాయి. చాలా కాలంగా ప్రతిపాదనలో ఉన్న ఉమ్మడి జిల్లాలో మూడో పామాయిల్ పరిశ్రమ కల్లూరిగూడెంలో డిసెంబరు నెలలో శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గంటకు 60టన్నుల సామర్థ్యంతో గెలల క్రషింగ్‌తో పాటు సొంతంగా విద్యుత్తు కూడా ఉత్పత్తి చేసేలా నిర్మాణాల ఆకృతులు (డిజైన్) రూపొందిస్తున్నారు. సుమారు రూ.100కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ సొమ్మును అప్పారావుపేట పరిశ్రమకు ఏ విధంగా ఎన్‌డీబీ(నేషనల్ డైరీబోర్డు) తీసుకున్నారో అదే రీతిలో తీసుకోవాలని తలపెట్టినట్లు సమాచారం. గతేడాది మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం గోపాలగిరిలో పామాయిల్ పరిశ్రమ నిర్మాణానికి శంకుస్థాపన జరిగిన విస్తీర్ణం అంతగా పెరగకపోవడంతో పనుల్లో పురోగతి లేదు. ప్రస్తుతం ఖమ్మం జిల్లా రైతులు ఆయిల్‌పాం గెలలను దమ్మపేట మండలం అప్పారావుపేట పరిశ్రమకు తెస్తున్నారు.

**పూర్తయిన స్థల సేకరణ!** కల్లూరిగూడెంలో పామాయిల్ పరిశ్రమ నిర్మాణానికి గ్రామ శివారులో 42ఎకరాలు మూడేళ్ల క్రితమే టీజీ ఆయిల్‌ఫెడ్ అధికారులు సేకరించి కొంతభాగం ఫెన్సింగ్ వేశారు. సత్తుపల్లి, వేంసూరు మండలాలతో పాటు పెనుబల్లి మండలాలకు అందుబాటులో ఉంటుందని ఈ ప్రాంతాన్ని ఎంపిక చేశారు. వ్యవసాయ, ఉద్యాన శాఖా మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు బాధ్యతలు చేపట్టాక ఆయిల్‌పాం పరిశ్రమల నిర్మాణం, తోటల పెంపకంలో వేగం పెరిగింది. ఈ విషయంపై టీజీ ఆయిల్‌ఫెడ్ డీఓ బాలకృష్ణను వివరణ కోరగా.. డిసెంబరు నెలలో శంకుస్థాపన చేసే అవకాశాలున్నాయని తెలిపారు.

# చెత్తతో చిచ్చు... కుక్కలతో రచ్చ!

హైదరాబాద్: అక్కడ చెత్తచెదారం గొడవలకు కారణమవుతున్నాయి. పెంపుడు జంతువులు కలహాలు సృష్టిస్తున్నాయి. గచ్చిబౌలిలో 10 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన గేటెడ్ కమ్యూనిటీలో రెండు కుటుంబాలు ఎదురెదురుగా ఉన్నా.. మాటల్లేవు. పొరుగు కుటుంబానికి చెందిన పెంపుడుకుక్క తమ ఇంటి ఎదుట మూత్రవిసర్జన చేసిందంటూ గృహిణి తిట్టడంతో.. తమనే అంతమాట అంటారా! అంటూ అవతలి వారు గొడవకు దిగారు. కమిటీ పెద్దలు సూచించినా మాట వినకుండా.. పోలీసు ఉన్నతాధికారికి ఫిర్యాదు చేసుకునేంత వరకూ చేరారు. కేపీహెచ్‌బీ కాలనీలోని అపార్ట్‌మెంట్స్ సముదాయంలో సంక్షేమసంఘం సమావేశంలో ఇద్దరు పెద్దల మధ్య తలెత్తిన స్వల్ప వివాదంతో ఒక వ్యక్తి లైసెన్స్‌డ్ తుపాకీతో బెదిరించేంత వరకూ చేరినట్టు విశ్వసనీయ సమాచారం.

**అనుకున్నదొక్కటి.. అయినదొక్కటీ**

భార్యాభర్తలిద్దరు ఐటీ నిపుణులు.. సొంతూళ్లో పొలం విక్రయించగా వచ్చిన సొమ్ముతో మూసాపేటలోని గేటెడ్ కమ్యూనిటీలో విల్లా కొన్నారు. కొత్తగా ఏర్పడిన కమిటీలో అధ్యక్షుడిగా పోటీపడిన వ్యక్తికి



ఓటేయలేదనే అక్కసుతో కొన్ని కుటుంబాలు వీరిని దూరంగా ఉంచాయి. వారి పిల్లాడితో ఆడుకోవద్దని తమ బిడ్డలకు చెప్పారంటూ ఆ తండ్రి ఆవేదన వెలిబుచ్చాడు. మాదాపూర్‌లోని గేటెడ్ కమ్యూనిటీలో ఉంటున్న తనకు మొదట్లో హాయిగా అనిపించినా క్రమంగా అక్కడ అంతర్గత రాజకీయాలు, ఉత్తరాది, దక్షిణాది ప్రజల మధ్య విబేధాలు బాధ కలిగిస్తున్నాయని నగరానికి చెందిన వ్యాపారి వివరించారు. గేటెడ్ కమ్యూనిటీస్‌లో కుటుంబాల మధ్య గొడవలకు అధికశాతం ఇంటినుంచి పడేసే వ్యర్థాలు, పెంపుడు జంతువులే కారణమని పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. సంక్షేమసంఘంలో తమ ప్రాతినిధ్యమే ఉండాలనే ఉద్దేశంతో వర్గాలుగా విడిపోయి ఉంటున్నారని సైబరాబాద్‌కు చెందిన ఒక ఇన్‌స్పెక్టర్ చెప్పారు. ప్రతినెలా తమ ఠాణాకు నాలుగైదు ఫిర్యాదులు ఇక్కడనుంచే వస్తున్నాయన్నారు. అవగాహన సదస్సులు ఏర్పాటు చేసినపుడు కలసిమెలసి ఉండాలని సూచిస్తుంటామని డీసీపీ వివరించారు. అక్కడి కుటుంబాల వాట్సాప్ గ్రూపుల్లోనూ పరస్పర విమర్శలు, ఆరోపణలతో గొడవకు దిగుతున్నారన్నారు.

# నేతన్నకు నూలు సాయం

సిరిసిల్ల : జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా మరమగ్గాలపై వస్త్రోత్పత్తులు జరుగుతున్నాయి. ఇక్కడ యజమాని, ఆసామి, కార్మికులు అని మూడంచెల వ్యవస్థ నడుస్తోంది. వస్త్రోత్పత్తుల ఆర్డర్లు వచ్చినప్పుడు పెట్టుబడుల కోసం చిన్న, మధ్య తరగతి ఆసాములు పూర్తిగా యజమానులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. దీనిలో మార్పు తెచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేములవాడలో రూ.50 కోట్ల కార్పస్ ఫండ్‌తో నూలు బ్యాంకును ప్రారంభించారు. ఇది ఉమ్మడి జిల్లాలోని చేనేత, మరమగ్గాల ఆసాములకు పెట్టుబడి భారం తగ్గిస్తుంది.

రాష్ట్రంలో 17 జిల్లాలో మరమగ్గాలు విస్తరించి ఉన్నాయి. వీటిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సిరిసిల్ల, కరీంనగర్, కొత్తపల్లి, గర్షకుర్తిలో 32 వేల మరమగ్గాలు, అయిదు వందల చేనేత మగ్గాలున్నాయి. వీటిపై ప్రభుత్వ, ప్రైవేటు వస్త్రోత్పత్తులు కలిపి ఏటా 20 వేల టన్నుల పాలిస్టర్, అయిదు టన్నులపైన కాటన్ నూలును వాడుతారు. మరమగ్గాలన్నీ పని చేస్తే రోజుకు పాలిస్టర్ 13.20 లక్షలు, కాటన్ 6.60 లక్షల మీటర్ల వస్త్రోత్పత్తి జరుగుతోంది. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో ఎక్కడా నూలు బ్యాంకు, ప్రైవేటు విక్రయశాలలు లేవు. ఉత్పత్తులకు అవసరమైన నూలును వ్యాపారులు హైదరాబాద్, మహారాష్ట్ర, సూరత్‌ల నుంచి తెప్పించి ఆసాములకు ఇస్తున్నారు. ప్రస్తుతం వేములవాడ చేనేత క్లస్టర్‌లో ఏర్పాటు చేసిన నూలు బ్యాంకుతో సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లోని ఆసాములకు ఉపయోగపడుతుంది.

**ప్రైవేటు ఉత్పత్తులకు?**

ఉమ్మడి జిల్లా వస్త్రోత్పత్తిదారులు చేతిరుమాళ్లు మొదలుకొని పట్టు, సిల్క్ వస్త్రాల వరకు ప్రైవేటు ఆర్డర్లు కూడా ఉత్పత్తి చేస్తుంటారు. వీటికి పక్క రాష్ట్రాల నుంచి నూలు దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో ఆసాములకు రవాణా భారంతోపాటు కొన్ని సందర్భాల్లో ఆర్డర్లకు అనువైన నూలు లభించక ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు నూలు కంపెనీలు సైతం జిల్లాలో నేరుగా విక్రయశాలలు ఏర్పాటు చేస్తే జిల్లా వస్త్ర పరిశ్రమలో ఉపాధి అవకాశాలు విస్తరించనున్నాయి.

**ప్రభుత్వ ఆర్డర్లకే**

వేములవాడలో టెస్కో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూలు బ్యాంకు ప్రభుత్వ ఆర్డర్లకు సరఫరా చేయనున్నది. వస్త్రోత్పత్తుల ఆర్డర్లు పొందిన మ్యాక్స్ సంఘాలకు అవసరమైన నూలు 90 శాతం అప్పుపైన ఇస్తారు. మిగతా పది శాతం సంఘాల్లోని సభ్యులంతా కలిసి చెల్లించాలి. పూర్తయిన వస్త్రోత్పత్తులు తిరిగి టెస్కోకే అప్పగించాలి. ఇలా అప్పగించిన వస్త్రంలో నూలు బిల్లులు మినహాయించుకుని మిగతా డబ్బులు చెల్లిస్తారు. దీంతో ఆసాములకు పెట్టుబడి భారం తగ్గుతుంది.

నూలు ఇవ్వడం ద్వారా పెట్టుబడి భారం తగ్గుతుంది. కానీ వస్త్రోత్పత్తులు చేసే కార్మికులకు ప్రతి వారం వేతనాలు ఇవ్వాలి. దీనికోసం ఆసాములు మరొకరిని ఆశ్రయించాల్సిన పరిస్థితులు ఉంటాయి. సిరిసిల్లలోని మరమగ్గాలు విస్తరించిన ప్రాంతాలు ఎక్కువగా ప్రభుత్వం పంపిణీ చేసిన స్థలాలు కావడం వల్ల వీటికి బ్యాంకులు రుణాలు ఇవ్వవు. ప్రభుత్వ మ్యాక్స్ సంఘాలకు రుణ పథకాలు అమలు చేయాలని ఆసాములు కోరుతున్నారు.

ప్రభుత్వ శాఖలకు అవసరమైన వస్త్రోత్పత్తులను టెస్కో నుంచి మాత్రమే సేకరించాలని ఇది వరకే ఉత్తర్వులు జారీ చేసింది. దానిలో భాగంగా ఏకరూప దుస్తులు, సంక్షేమశాఖకు అవసరమైన వస్త్రం ఆర్డర్లు ఇచ్చారు. ఇవి కాకుండా రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ఏటా రెండు చీరలు ఇచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు చేసింది. దీనికి సంబంధించి 1.28 కోట్ల చీరలు అవసరం. వీటి ఆర్డర్లలో సింహభాగం కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లోనే ఉత్పత్తి జరగనుంది. ప్రభుత్వ ఆర్డర్లు ఖరారయ్యాక టెస్కో ఆధ్వర్యంలో నూలు కొనుగోలుకు టెండర్లు పిలుస్తారు. అందులో అవకాశం దక్కించుకున్న సంస్థలు మాత్రమే నూలు సరఫరా చేస్తాయి.

# అసలెంతో లెక్కలేదు.. ఆక్రమణకు అంతులేదు



దుండిగల్ : రూ.వంద కోట్ల సర్కారు భూమిడిని ప్లాట్లు చేసి విక్రయిస్తున్నా అధికారులు కిమ్మనడం లేదు. మేడ్చల్ జిల్లా గండిమైసమ్మ దుండిగల్ మండలం డి.పోచంపల్లి సర్వే నం. 120లో ఈ భూమి ఉంది. ఇక్కడ ప్రభుత్వ భూమి ఎంత ఉందనే లెక్కలే అధికారుల వద్ద లేవు. దీనిపై పరిశీలనలో పలు విషయాలు వెలుగుచూశాయి డి.పోంచంపల్లిలో సర్వే నంబరు 120లో ప్రభుత్వానికి 158.23 ఎకరాల భూమి ఉంది. ఇందులో 66.25 ఎకరాలు మాజీ సైనికులకు, స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ బాధితులకు కేటాయించారు. మిగిలిన 91.98 ఎకరాలను సాగు కోసం పేదలకు పట్టాలు ఇచ్చారు. కొందరు సాగు చేయకుండా నిబంధనలు ఉల్లంఘించడంతో 45 ఎకరాలను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంది. అనంతరం భారాస కార్యాలయానికి ఎకరా, బౌరంపేట పీఏసీఎస్‌కు రెండెకరాలు, ఎస్టీ వసతి గృహానికి 2.25 ఎకరాలు, ఎవెన్యూ ప్లాంటెషన్‌కు ఎకరా కేటాయించారు. ఏడు ఎకరాల్లో రహదారులు నిర్మించారు. మిగిలిన భూమిలో 30 ఎకరాల వరకు కబ్జాకు గురైందని అధికారులు అంచనా.

**జోరుగా బస్తీల మధ్య స్థలాల విక్రయం..**

భూముల ధరలు పెరగడంతో కొన్నేళ్లుగా కబ్జాదారులు అసైన్డ్ భూముల యజమానులకు ఎంతో కొంత ముట్టజెప్పి స్థిరాస్థి వ్యాపారం చేశారు. ప్రైవేటు భూముల్లోని ప్లాట్లతో పోలిస్తే తక్కువకే రావడంతో పేదలు కొనుగోలు చేశారు. అధికారులకు ఫిర్యాదుల రావడంతో కట్టడాలను కూల్చగా.. తిరిగి నిర్మించారు. ఇళ్ల యజమానులకు 58, 59 జీవోల కింద పట్టాలు పంపిణీ చేశారు. ఇలా ఇక్కడ చంద్రశేఖర్‌రెడ్డినగర్, డాక్టర్ బస్తీ, సాయిపూజా కాలనీలు వెలిశాయి. తాజాగా కొందరు ఈ కాలనీల్లో ఇళ్ల మధ్య ఉన్న స్థలాలను రాత్రికి రాత్రే స్వాధీనం చేసుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. అనంతరం వాటిని రూ.15 లక్షల వరకు విక్రయిస్తున్నారు.

**కేటాయించిన భూములపై కన్ను...** గండిమైసమ్మ చౌరస్తా నుంచి మేడ్చల్ రహదారికి ఆనుకొని ఎస్సీ వసతిగృహానికి 2.25 ఎకరాలు కేటాయించారు. ఇక్కడ ఎకరా రూ.10 కోట్ల వరకు పలుకుతోంది. దీంతో ఖాళీగా ఉన్న ఈ భూమిపై అక్రమా ర్కుల కన్ను పడింది. అందులో రెండు ఇళ్లను నిర్మించారు. రోడ్డుకు ఆనుకొని ఇటీవల కంటైనర్లను ఏర్పాటు చేసి గదిని నిర్మించారు. అధికారులు గదిని మాత్రం కూల్చేశారు. చంద్రశేఖర్‌రెడ్డి నగర్‌లోనూ మూడు ఎకరాల కబ్జాకు యత్నించారు. అదే ప్రాంతంలోని 3 ఎకరాల్లో ప్లాట్లు వేశారు. ఇక్కడే మరో 6 ఎకరాల భూమి కబ్జాదారుల పరమైంది. స్థానికుల ఆందోళనతో అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

**చర్యలు తీసుకుంటాం**ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటాం. ఆర్ఐతో పాటు సిబ్బందిని అప్రమత్తం చేసి సర్వేనం.120లో ఉన్న కంటైనర్‌లతో పాటు ఇతర ఆక్రమణలు తొలగిస్తాం. – మతిన్, తహసీల్దార్, గండిమైసమ్మ దుండిగల్ మండలం

# మున్సిపాలిటీల్లో గ్రామ పంచాయతీల విలీనం షురూ




హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ శివారులోని మున్సిపాలిటీల్లోకి అక్కడున్న సమీప గ్రామపంచాయతీలు విలీనమయ్యాయి. గ్రేటర్ హైదరాబాద్‌ను బాహ్యవలయ రహదారి వరకూ విస్తరించే క్రమంలో శివారు మున్సిపాలిటీలతో పాటు రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లోని 51 గ్రామ పంచాయతీలను విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలిదశలో శివారు మున్సిపాలిటీల్లో 51 గ్రామాలను కలిపేందుకు రెండునెలల క్రితం ఆర్డినెన్స్ జారీచేసింది. ఇందులోని అంశాలకు అనుగుణంగా మున్సిపాలిటీ అధికారులు కొద్దిరోజుల నుంచి చర్యలు చేపట్టారు. గ్రామ పంచాయతీల రికార్డులు, భూములను స్వాధీనం చేసుకున్న అధికారులు ఇళ్లు, ప్రభుత్వ ఆస్తులను మున్సిపాలిటీల్లోని వార్డుల ఖాతాల్లోకి చేర్చారు. ఆస్తిపన్నులను వసూలు చేస్తున్నా.. ఆయా గ్రామ పంచాయతీల పేర్లను సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయకపోవడంతో ఆన్‌లైన్ ద్వారా చెల్లించేందుకు సాధ్యం కావడం లేదు. ఇక ఇప్పటి వరకూ గ్రామ పంచాయతీల్లో నివసిస్తున్నవారు మున్సిపాలిటీ వ్యవస్థలోకి వెళ్లడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులు, ఉద్యోగులకు బాధ్యతలు**

గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులుగా విధులు నిర్వహించిన వారిని నేరుగా పురపాలకశాఖ అధికారులుగా పరిగణనలోకి తీసుకున్నారు. ఇప్పటివరకూ వారు విధులు నిర్వహించిన సంవత్సరాలను సర్వీసుగా పరిగణించారు. గ్రామ పంచాయతీల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహించిన వారిని కూడా మున్సిపాలిటీ అధికారులు తీసుకున్నా... వార్డుల్లో పని విధానం, ఇతర కార్యకలాపాలను దృష్టిలో ఉంచుకుని వీరికి ఉద్యోగం ఇస్తున్నారు. సర్వే లెక్కలు, గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ గ్రామాల్లో పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగాలు ఇస్తున్నారు. వీరందరికీ పురపాలకశాఖ నుంచి జీతాలు వచ్చేవిధంగా చర్యలు చేపట్టారు. మున్సిపాలిటీల పరిధి పెరిగిన దృష్ట్యా మరికొందరు కొత్తవారిని నియమించుకోవాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయని మున్సిపల్ కమిషనర్లు, పురపాలక శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

**మౌలిక వసతులపై నజర్** మున్సిపాలిటీల్లో విలీనమైన 51 గ్రామాల్లో మౌలిక వసతులపై మున్సిపల్ కమిషనర్లు దృష్టి సారించారు. చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కొత్తగా విలీనమైన గ్రామాల బాధ్యతలు పర్యవేక్షిస్తున్న అధికారులను ఆదేశించారు. తాగునీటి సౌకర్యం లేని ప్రాంతాలను గుర్తించి ట్యాంకర్లతో సరఫరా చేయాలని నిర్ణయించారు. మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న నీటి పరిమాణాన్ని తెలుసుకుని పంచాయతీ, గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారుల ద్వారా కొత్త పైప్‌లైన్లు, పైప్‌లైన్ల సామర్థ్యం పెంచేందుకు నివేదికలు అడుగుతున్నారు. ఆయా గ్రామాల్లో మురుగునీటి ప్రవాహాన్ని ఎక్కడికి పంపించాలన్న అంశంపై ప్రణాళికలను రూపొందించి మురుగునీటి వ్యర్థాల నిర్వహణను చేపట్టనున్నారు.

# అక్రమాలపై చర్యలేవీ..?

జగిత్యాల : జగిత్యాల పురపాలికలో వరుసగా వెలుగు చూస్తున్న అక్రమాలపై చర్యలు చేపట్టడంలో జాప్యం జరుగుతోంది. ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన కార్మిక నియామకాలపై ఏకంగా కౌన్సిలర్లే కలెక్టర్, సీడీఎంఏకు ఫిర్యాదు చేయడంతో అధికారుల్లో గుబులు మొదలైంది. చేసిన తప్పుల్ని ఎలా దిద్దుకోవాలో తెలియక కిందిస్థాయివారిపై ఒత్తిడి చేస్తున్నారు. తాజాగా రూ.45 లక్షలతో కొనుగోలు చేసి ఏడాదిగా పక్కనబెట్టిన స్వీపింగ్‌యంత్రాన్ని వెంటనే నిర్వహణలోకి తీసుకురావాలని సీడీఎంఏ అక్టోబరు 26న తాఖీదులు జారీ చేసింది. మరోవైపు పారిశుద్ధ్య కార్మికుల అక్రమ నియామకాలపై అధికారులకు కమిషనర్ చిరంజీవి ఈ నెల 14న మెమో జారీ చేశారు. వీటన్నింటిపైనా అధికారుల వద్ద స్పష్టమైన సమాధానం లేకపోవడంతో ఉన్నతాధికారులు చర్యలకు వెనుకాడుతున్నారు.

**నియామకాల్లో బాధ్యులెవరు..?**

నాలుగు నెలల కిందట కలెక్టర్, పురపాలక ఆమోదం లేకుండా ఏకంగా 12 మంది పారిశుద్ధ్య ఒప్పంద కార్మికులను నియమించిన తీరును ఇటీవల వెలుగులోకి తెచ్చింది. ఒక్కొక్కరి నుంచి రూ.1.50 లక్షలు తీసుకుని కొందరు కార్మికులకు బాధ్యతలు అప్పగించారు. ఈ విషయంపై కొందరు కౌన్సిలర్లు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నియామకాల్ని రద్దు చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. సీడీఎంఏకు సైతం ఫిర్యాదు చేయడంతో కార్మికుల వేతనాల దస్త్రాన్ని కమిషనర్ చిరంజీవి సైతం పక్కనపెట్టారు. గతంలో పనిచేసిన ఒకరిద్దరు కమిషనర్లు సైతం కార్మికుల నియామక అంశానికి వ్యతిరేకించిన సందర్భాలున్నాయి. తాజాగా కమిషనర్ సంబంధిత అధికారులకు ఈ నెల 14న మెమో జారీ చేశారు. పాతవారి స్థానంలో కొత్తవారిని ఎందుకు తీసుకోవాల్సి




వచ్చింది.. ఏ రకంగా నియామకాలు చేపట్టారు.. తదితర అంశాలకు 5 రోజుల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో నూతనంగా నియమించినవారికి పనిచేసిన కాలంలో వేతనాలు చెల్లించి దీనిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కమిషనర్‌కు మౌఖిక ఆదేశాలు జారీచేసినట్లు సమాచారం.

**మరమ్మతుకు రూ.12 లక్షలు..**

పట్టణ ప్రగతి నిధుల నుంచి మూడేళ్ల కిందట రూ.45 లక్షలతో కొనుగోలు చేసిన స్వీపింగ్ యంత్రం ఏడాది తిరగకముందే సాంకేతిక పరమైన మరమ్మతులతో మూలన పడింది. గతేడాది బల్దియా అధికారులు రూ.12 లక్షలు మరమ్మతుకు ఖర్చు చేసినట్లు చూపినా ఇప్పటి వరకూ రోడ్డెక్కకపోవడం గమనార్హం. కొత్తబస్టాండు నీళ్లట్యాంకు వద్ద వృథాగా ఉన్న స్వీపింగ్ యంత్రాన్ని వెంటనే నిర్వహణలోకి తీసుకురావాలని సీడీఎంఏ అధికారులను ఆదేశించినా ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

# ఆన్‌లైన్‌లో వివరాలు లేక.. సీసీఐకి విక్రయించలేక..

కోనరావుపేట : ఆరుగాలం కష్టించి పండించిన పత్తిని భారత పత్తి సంస్థ (సీసీఐ) కొనుగోలు కేంద్రాల్లో విక్రయానికి ఇబ్బందులు తప్పడం లేదు. వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల అన్నదాతలు సాగు చేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. దీంతో సీసీఐ అధికారులు తెల్లబంగారం కొనుగోలుకు అంగీకరించడం లేదు. దీంతో చేసేదేమీ లేక కొంతమంది రైతులు మధ్యదళారులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారు.

జిల్లాలో సుమారు 50 వేల ఎకరాల్లో ఈ ఏడాది వానాకాలంలో రైతులు తెల్లబంగారం సాగు చేశారు. వేములవాడ నియోజకవర్గంలోని అన్ని మండలాలతో పాటు జిల్లాలోని బోయినపల్లి, ఇల్లంతకుంట, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లో నల్లరేగడి భూములు ఎక్కువగా ఉండటంతో పత్తిసాగు చేశారు. రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేయడానికి వేములవాడ పురపాలక సంఘం పరిధిలో నాంపల్లి, వేములవాడ అర్బన్ మండలం సంకెపల్లి, కోనరావుపేట మండలం సుద్దాల, ఇల్లంతకుంట మండలంలో మరో రెండు కొనుగోలు కేంద్రాలను సీసీఐ ఏర్పాటు చేసింది.

క్వింటాల్ పత్తికి 8 తేమ శాతం ఉంటే రూ.7,521ల గరిష్ఠ మద్దతు ధర చెల్లించనున్నారు. 12 తేమ శాతం ఉంటే రూ.7,220ల కనిష్ఠ మద్దతు ధర ప్రకటించింది.



సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తి విక్రయించాలంటే వ్యవసాయశాఖ అధికారులు రైతుల పంట వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఉండాలన్న నిబంధనను తప్పనిసరి చేసింది. చాలా మంది రైతుల పంట వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. దీంతో సీసీఐ కేంద్రాల్లో అమ్మకానికి అడ్డంకి ఏర్పడింది. దీంతో మధ్యదళారులకు క్వింటాల్ రూ.6,500 నుంచి రూ.6,800లకు విక్రయిస్తున్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాల ప్రారంభం సమయంలో తేమశాతం అధికంగా ఉండటంతో చాలా మంది విక్రయానికి తీసుకురాలేదు. వారం, పది రోజులుగా వాతావరణం అనుకూలించడం వల్ల తేమశాతం రావడంతో రోజుకు 80 పైగా వాహనాల్లో తీసుకొస్తున్నారు.

వ్యవసాయ విస్తరణాధికారుల తప్పిదంతో...

వ్యవసాయ విస్తరణాధికారులు తమ క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో రైతుల పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. వారు క్షేత్రస్థాయికి వెళ్లకుండా రైతు వేదికల్లో కూర్చొని ఇతర రైతులను అడిగి తెలుసుకుని నమోదు చేశారు. పంట వివరాలు సేకరణలో నిర్లక్ష్యం వల్ల పత్తికి బదులుగా వరి, వరికి బదులుగా పత్తి నమోదు చేశారు. మరికొందరి పంట వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. దీంతో అన్నదాతలు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయానికి ప్రతిబంధకంగా మారింది.

**తాత్కాలిక నమోదుకు చర్యలు- ప్రకాశ్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి**

మధ్యదళారులను అరికట్టడానికి సీసీఐ పటిష్ఠ చర్యలు తీసుకుంది. వ్యవసాయశాఖ అధికారులు పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోతే సీసీఐ నిబంధనల మేరకు పత్తి విక్రయాలకు అవకాశం లేదు. వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి ప్రస్తుతం అవకాశం లేదు. సమస్య మా దృష్టికి వచ్చింది. అర్హులైన రైతులు పత్తి విక్రయానికి తాత్కాలికం(టెంపరరీ)గా వారి వివరాలు నమోదుకు అనుమతులు ఇవ్వాలన్నది కలెక్టర్, ఉన్నతాధికారుల పరిశీలనలో ఉంది. అనుమతులు రాగానే ఏఈవోలు అర్హులైన రైతులకు తాత్కాలిక నమోదు పత్రాలు ఇస్తే విక్రయానికి ఇబ్బందులు ఉండవు. రైతులు కొంత ఓపిక పట్టాలి.

# రైతులకు తేమ కష్టాలు

ఆలేరు : ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించి రోజుల తరబడి ఆరబోస్తున్నా 17శాతం తేమ రావడంలేదు. ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో వానాకాలం సీజన్‌లో 11.68 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. 15.72 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. శీతాకాలం కావడం, వాతావరణంలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతుండటంతో నిర్ణీత తేమశాతం రావడం లేదు. కొనుగోలు దారులు తూకం వేయడం లేదు. ఫలితంగా రైతులు 10–15 రోజులు కేంద్రాలలో నిరీక్షించాల్సి వస్తోంది.



**ఆర బెట్టడం సమస్యగా మారుతోంది...**

ధాన్యాన్ని ఆర బెట్టడం రైతులకు పెద్ద సమస్యగా మారుతోంది. కేంద్రాలలో సరిపడినంతగా స్థలం లేకపోవడం, సకాలంలో కూలీలు దొరకకపోవడం లాంటివి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. అయినప్పటికీ రైతులు రోజుకు ధాన్యాన్ని రెండు, మూడు దఫాలుగా ఆర బెడుతున్నారు. అయినప్పటికీ తేమశాతం రావడం లేదు. రాత్రి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీల సెల్సియస్ వరకు పడిపోతుండటంతో ధాన్యంపై మంచు కురిసి.. మధ్యాహ్నం వరకు కూడా పోవడం లేదు.

ధాన్యం ఎండడానికి సమయం పడుతోంది. ఒకవైపు, మరోవైపు వాతావరణ మార్పులతో పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతుండటంతో కూడా ధాన్యంలో తేమ శాతం రాకపోవడానికి ఒక కారణంగా నిలుస్తోంది. రైతులు నిత్యం ఉదయం పది గంటలకు ఆరబోయడం.. సాయంత్రం ఐదు గంటలకు కుప్పలు చేస్తున్నారు.

**తూకానికి మరింత సమయం..** ధాన్యంలో తేమశాతం రావడం ఒక ఎత్తైతే.. తేమశాతం వచ్చిన తర్వాత ధాన్యాన్ని తూకం వేయడం మరొక ఎత్తుగా మారుతోంది. కొన్ని కొనుగోలు కేంద్రాలలో సాయంత్రం తేమ శాతం వస్తే ఉదయం కల్లా తగ్గుతోంది. కేంద్రం నిర్వాహకులు ధాన్యాన్ని తూకం వేయడం లేదు. ఫలితంగా కేంద్రాలు ధాన్యం రాసులతో నిండిపోతున్నాయి. ఫలితంగా రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాలలో నిరీక్షించాల్సి వస్తుండటంతో ఇబ్బందులకు గురవుతున్నారు.

# మేల్కొంటేనే పచ్చదనం!



పెద్దపల్లి : అటవీ విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోంది. ఏటా ఆర్భాటంగా లక్షల్లో మొక్కలు నాటుతున్నా.. సంరక్షణను గాలికొదిలేస్తున్నారు. రూ.కోట్ల నిధులు ఖర్చైనప్పటికీ ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు. 2025-26 ఏడాదికి సంబంధించి మొక్కల పెంపకం లక్ష్యాన్ని నిర్ణయించారు. విత్తన దశలోనే నిర్లక్ష్యం నెలకొంది. నర్సరీల్లో మౌలిక వసతులు కొరవడి వేసవి ఎండ వేడిమి తట్టుకోలేక ఎండిపోతున్నాయి. గత అడ్డంకులు అధిగమిస్తేనే హరిత కల ఫలించనుంది.

ఇదీ పరిస్థితి మొక్కల కొరత లేకుండా ఊరికొక నర్సరీ ఉంది. అక్కడ నీడ కోసం పైకప్పు ఏర్పాటు చేయడం లేదు.

చుట్టూ కంచె లేక మొక్కలు పశువులకు మేతగా మారుతున్నాయి.

బోరు వసతి కొరవడటంతో మొక్కలు నీరందడం లేదు.

నాణ్యమైన విత్తనాలు కాకపోవడంతో సంచుల్లో చనిపోతున్నాయి.

గత ప్రభుత్వం హరితహారంలో భాగంగా మొక్కలు నాటగా ప్రస్తుతం వన మహోత్సవం పేరిట ఈ కార్యక్రమం అమలవుతోంది.

ః నర్సరీల్లో సీతాఫలం, నిమ్మ, బత్తాయి, జామ, అల్లనేరడి, జామ, చింత, మల్లె, జాజిమల్లె ఇలా.. పూలు, నీడనిచ్చె తదితర మొక్కలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

నర్సరీల్లో విత్తనం విత్తిన నుంచి మూడేళ్లలోపు నిర్వహణ కోసం ఉపాధిహామీ నిధులు కేటాయిస్తున్నారు.

నర్సరీల్లో సంచుల్లో నింపి విత్తనాలు, విత్తడం సుమారు 2 మీటర్ల ఎత్తు మొక్క ఎదిగే వరకు ఒక్కోదానికి రూ. 114, నాటిన మొక్క రక్షణకు ముళ్లచెట్లతో రక్షణ కంచె (పెన్సింగ్)కు రూ. 190, మరో రెండేళ్ల నిర్వహణకు రూ. 126 ఇలా మొత్తం ఒక్కో మొక్కకు రూ. 430 ఖర్చవుతోంది.

వచ్చే ఏడాది 16.34 మొక్కలు నాటాలని లక్ష్యం విధించారు. పది శాతం అదనంగా నర్సరీల్లో 20.69 లక్షల మొక్కలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

నర్సరీల్లో ప్రతి మొక్క మూడు మీటర్ల వరకు ఎత్తు ఎదగాలి. కానీ.. విత్తణాల్లో నాణ్యత లేమి, నీళ్ల సమస్య, షేడ్ నెట్‌లతో నీడ అందివ్వకపోవడం వంటి కారణాలతో మొక్కలు ఆశించిన మేర ఎదగడం లేదు. విత్తన దశలోనే మేల్కొంటేనే వన మహోత్సవ కార్యక్రమం విజయవంతం అవుతోంది. ఆ దిశగా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో దృష్టి సారించాల్సి ఉంది.

## సమగ్ర కులగణనకు కసరత్తు

నల్గొండ: సమగ్ర కులగణన చేపట్టేందుకు నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఒకట్రెండు రోజుల్లో మార్గదర్శకాలు వెలువడనున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ భారీ క్రతువును రెండు నెలల్లో పూర్తి చేయాలని సర్కారు భావిస్తోంది. ఈ దిశగా మూడు జిల్లాల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిని కార్యోన్ముఖులను చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సమయంలో గత భారాస ప్రభుత్వం 2014లో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించింది. జనాభా దామాషా ప్రకారం ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు ఉండాలని గత కొన్నాళ్ల నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో పదేళ్ల అనంతరం మరోసారి సమగ్ర కులగణన చేపట్టనుండటం విశేషం.

సమగ్ర వివరాల సేకరణ

కులగణనలో క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి కుటుంబం కులంతో పాటు వారి ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులు, విద్యా, ఉద్యోగం తదితర పరిస్థితులను సేకరించనున్నారు. వీటన్నింటినీ క్రోడీకరించి సమగ్ర నివేదికను జిల్లాల వారీగా ప్రభుత్వానికి నివేదించనున్నారు. బీసీల్లోని ఉపకులాలను సైతం ఈ సర్వేలో పొందుపరచనున్నారు.



దీని ద్వారానే రానున్న పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో బీసీల కోటాను నిర్ధారించనున్నారు.

రాజకీయ అవకాశాలు లభిస్తాయని..

ప్రస్తుతం మూడు జిల్లాల్లోనూ మొత్తం జనాభాలో సుమారు 52 శాతం బీసీ జనాభా ఉంది. ఉమ్మడి జిల్లాలో అనాదిగా ఆధిపత్య వర్గాల అండ లేకపోవడంతో బీసీలకు రాజకీయంగా సరైన ప్రాధాన్యం దక్కడం లేదని ఏళ్ల నుంచి ఆయా సంఘాలు విమర్శిస్తున్నాయి. ఈ సర్వే ద్వారా బీసీ లెక్క తేలితే దాని ఆధారంగా రాజకీయ అవకాశాలు లభిస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నోడల్ ఏజెన్సీగా ఉన్న ప్రణాళిక శాఖలో తగినంత సిబ్బంది లేకపోవడంతో ఈ సర్వే జరిగే రెండు నెలల పాటు ఇతర శాఖల నుంచి పలువురిని డిప్యుటేషన్ మీద తీసుకోనున్నట్లు తెలిసింది. సర్కారు నుంచి మార్గదర్శకాలు విడుదలైన వెంటనే క్షేత్రస్థాయిలో పని మొదలుపెట్టాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో ఒకట్రెండు రోజుల్లో దీనిపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం.

## శుభ ముహూర్తాలొచ్చేస్తున్నాయ్..!

యాదగిరిగుట్ట : మూడు నెలల మూడాలు ముగిసి శుభకార్యాలకు తెర తొలిగే రోజులు సమీపిస్తున్నాయి. పెళ్లి బాజాభజంత్రీలతో సహా బరాత్‌ల మోత మోగనుంది. మరో మూడు నెలలు మంచి ముహూర్తాలు ఉన్నాయని, యాదాద్రి క్షేత్రంలోని ప్రధానాలయ పూజారులు, పంచాంగకర్తలు, బ్రాహ్మణ పూజారులు చెబుతున్నారు. వివాహ సంబంధాలు కుదుర్చుకునే క్రతువులు అంటే.. పెళ్లి చూపులు, సంబంధం ఒప్పందం, మాటాముచ్చట్లు ముమ్మరమయ్యాయి. వచ్చే నెల 3 నుంచి శుభ ఘడియలు మొదలై, 20 వరకు పన్నెండు శుభముహూర్తాలున్నట్లు పండితులు చెబుతున్నారు.

కార్తిక మాసం.. దీపావళి సంబరాలయ్యాక నవంబరు(కార్తీక మాసం)లో 3వ తేదీ రాత్రి వేళ. 7న ఉదయం, రాత్రి, 8న ఉదయం, 10వ తేదీ ఉదయం, రాత్రి, 13న ఉదయం 14న ఉదయం, 17న మూడు వేళల్లో, ఇక 20న ఉదయం మంచి ముహూర్తాలున్నాయి.

వచ్చే డిసెంబరు(మార్గశిరం) నెలలో 4, 5, 6, 11, 20, 25 తేదీల్లో వివాహ బంధాలకు శుభాశీస్సులు ఉన్నాయి.

మాఘ మాసంలో.. వచ్చే ఏడాది జనవరి (మాఘమాసం)లో 31న ఉదయం, రాత్రి రెండు ముహూర్తాలున్నాయి. ఫిబ్రవరి 2, 7 తేదీల్లో ఉదయం, రాత్రి, 13న ఉదయం, 14న రాత్రి, 16న మూడు వేళల్లో ముహూర్తాలున్నాయి. 20న రెండు, 22, 23 తేదీల్లో కూడా రెండేసి ముహూర్తాలున్నాయి.

ఫాల్గుణంలో.. వచ్చే మార్చి 2వ తేదీన ఉదయం రెండు, రాత్రి రెండు ముహూర్తాలు. 6వ తేదీన మూడు వేళల్లో కల్యాణ ఘడియలు ఉన్నట్లు పంచాంగకర్తలు, ప్రధాన పూజారి లక్ష్మీనరసింహాచార్య, విశ్రాంత పురోహితులు బుచ్చయ్యశర్మ తెలిపారు.

## విష్ణుపురం స్టేషన్.. 'ఇక రైల్వే జంక్షన్!'

మిర్యాలగూడ : గుంటూరు-నడికుడి మార్గంలో నల్గొండ జిల్లా సరిహద్దులో ఉన్న విష్ణుపురం రైల్వేస్టేషన్‌ను 'రైల్వే జంక్షన్'గా మార్చాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. 20 వేల మెగావాట్ల సామర్థ్యంతో దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద రాష్ట్రంలోనే అతిపెద్ద 'యాదాద్రి థర్మల్ ప్లాంటు'ను నిర్మిస్తుండగా దీనికి సమీపంలో ఉన్న విష్ణుపురం స్టేషన్‌ను జంక్షన్‌ని చేయాలని అధికారులు ప్రతిపాదించారు. యాదాద్రి థర్మల్ ప్లాంటుకు నిత్యం 21 రైల్వే వ్యాగన్లలో కరీంనగర్ రామగుండం నుంచి బొగ్గు రవాణా చేయాల్సి ఉంటుంది. జాన్‌పహాడ్ మార్గంలో ప్రస్తుతం ఉన్న రైల్వే లైనుకు అదనంగా మరోలైను నిర్మిస్తున్నారు.సాధారణంగా మూడు మార్గాలు కలిసే స్టేషన్‌ను జంక్షన్‌గా మార్చుతారు. గుంటూరు-బీబీనగర్ రైల్వే లైను ఇప్పటివరకు ఒకే మార్గంగా ఉండగా ప్రస్తుతం రెండు వరసలుగా విస్తరిస్తున్నారు. మిర్యాలగూడ గుంతకల్లు రైల్వే లైను సైతం ఏర్పాటు చేయాలని రైల్వేశాఖ నిర్ణయించడంతో విష్ణుపురం స్టేషన్‌లో మరింత రద్దీ పెరిగే అవకాశం ఉంది. గుంటూరు, జాన్‌పహాడ్ లైను, వీర్లపాలెం యాదాద్రి థర్మల్ ప్లాంటు రైలుమార్గాలు ఇక్కడ కలుస్తుండగా జంక్షన్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ప్రస్తుతం రైల్వే లైన్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నందున జంక్షన్‌కు అవసరమైన విద్యుత్తు, రైల్వే సురక్షిత సౌకర్యాలు కల్పిస్తున్నారు.భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా నియంత్రించే 'కవచ్' విధానం సైతం ఇక్కడ ఏర్పాటు చేసేలా సన్నాహాలు చేస్తున్నారు. యాదాద్రి థర్మల్ ప్లాంటుకు ఐదు కిలోమీటర్ల మేరకు రైల్వే లైను ఏర్పాటు చేస్తుండగా దీనికి అనుసంధానంగా జంక్షన్‌లో అవసరమైన పనులు జరిపించాలని నిర్ణయించినట్లు రైల్వే ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

# మన చేతుల్లోనే ఆరోగ్యం



సిద్దిపేట : సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక మొదలు ఐదో తరగతి వరకు 94 మంది చదువుతున్నారు. నిత్యం ఉదయాన్నే ప్రార్థన సమయంలో చేతుల శుభ్రతపై ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు. ద్రావణాన్ని అందుబాటులో ఉంచుతున్నారు. ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నారు. పిల్లల ఆరోగ్యానికి ఇలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని హెచ్ఎం సయ్యద్ సంధాని చెబుతున్నారు. వంట నిర్వాహకుల విషయంలోనూ ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు.ఆరోగ్యమే మహాభాగ్యం. ఇందుకు ప్రతీ అంశం కీలకమే. దినచర్యలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే.. సురక్షిత జీవనం సొంతం. చేతుల శుభ్రత అత్యంత ప్రాధాన్యంతో కూడుకుంది. తద్వారా ఎన్నో రోగాల నుంచి కాపాడుకోవచ్చని వైద్యులు సూచిస్తు న్నారు. ఇటీవల ఆరోగ్య స్పృహ పెరిగినా.. విద్యాలయాల్లో కచ్చితంగా అమలు చేయాలి. నేడు ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా సిద్దిపేటకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డా. రామ్మోహన్ ఇలా వివరించారు.

అపరిశుభ్రతతో..

అనారోగ్యానికి కారణం. చిన్నారుల్లో అవగాహన లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఒకప్పటితో పోలిస్తే కొంత మార్పు కనిపిస్తోంది. విద్యాసంస్థల్లో మాత్రం భిన్నమైన పరిస్థితి నెలకొంది. అత్యధిక చోట్ల నీటి వసతి ఉన్నా సబ్బు లేదా ద్రావణాలు ఉంచడం లేదు. మధ్యాహ్న భోజనం, స్నాక్స్ తినే ముందు, ఆడినప్పుడు, శౌచాలయానికి వెళ్లినప్పుడు మామూలుగా శుభ్రం చేసుకుంటున్నారు. విద్యాసంస్థల నిర్వాహకులు దీనిపై శ్రద్ధ వహించాలి. గ్రామాల్లో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి.

ఇలా చేద్దాం..

భోజనానికి ముందు చేతుల శుభ్రత తప్పనిసరి. ఒక నిమిషం ఇందుకు కేటాయించాలి. ః దగ్గినా, తుమ్మినా విస్మరించొద్దు. ః మల, మూత్ర విసర్జన తర్వాత కాళ్లు, చేతులు కడుక్కోవాలి. ః పాఠశాలల్లో ద్రావణం లేదా సబ్బును అందుబాటులో ఉంచాలి. ః ఉంగరాలు పెట్టుకునే చేతి వేళ్లను ఎక్కువ శుభ్రం చేయాలి. ః వైరస్, బ్యాక్టీరియాలు ఒంట్లోకి చేరేందుకు చేతులే వాహకాలు. కళ్లు, ముక్కు, నోటిని తరచూ చేతులతో తాకే ప్రయత్నం చేయొద్దు. ః చేతుల శుభ్రత అలవాటుగా మారితే అనారోగ్య సమస్యల నుంచి 90 శాతం భద్రంగా ఉన్నట్టే.

బాధ్యత వహిస్తే..

సబ్బు లేదా ద్రావణంతో చేతుల శుభ్రతతో అతిసారం 30 శాతం, శ్వాసకోశ వ్యాధులను 20 శాతం వరకు నివారించవచ్చు. కలరా, ఎబోలా, హెపటైటిస్-ఈ తదితర వాటి కారకాల వ్యాప్తిని అడ్డుకోవచ్చు. కడగకుండా అల్పాహారం, ఆహారం తీసుకుంటే హానికర క్రిములు పొట్టలో చేరే అవకాశం మెండు. కొన్ని సందర్భాల్లో టైఫాయిడ్, కడుపునొప్పి, విరేచనాల బారిన పడుతుంటారు. తల్లిదండ్రులు బాధ్యతగా బాల్యంలోనే అవగాహన కల్పించాలి.

అలవాటు చేస్తూ..

వికారాబాద్‌లోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో హ్యాండ్‌వాష్, సబ్బు అందుబాటులో ఉంచుతున్నారు. ప్రధానోపాధ్యాయుడు జాక వెంకటేశం పక్కాగా పర్యవేక్షిస్తున్నారు. విద్యార్థులకు దీన్ని అలవాటుగా మారుస్తున్నారు. ఈ బడిలో 378 మంది చదువుకుంటున్నారు. ఇంట్లోనూ పాటించాల్సిన పద్ధతుల గురించి ప్రత్యేకంగా వివరిస్తున్నారు. తరచూ స్థానిక వైద్యులతో సమావేశాలు నిర్వహిస్తూ చైతన్యం తీసుకొస్తున్నారు.

జిల్లాలో ఇలా..జనాభా: 12.5 లక్షలు


అన్ని రకాల విద్యాలయాలు (1-10వ తరగతి వరకు): 1623

విద్యార్థులు: 2.39 లక్షలు

# సగం ఎస్టీపీలు.. ఎఫ్‌టీఎల్‌లోనే!..

# హైడ్రా దెబ్బతో కొత్త స్థలాల ఎంపిక

హైదరాబాద్: జలమండలి కొత్తగా నిర్మించనున్న మురుగు శుద్ధి కేంద్రాలు(ఎస్టీపీల) చాలా వరకు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయని జలమండలి ఆలస్యంగా గుర్తించింది. మొత్తం 39 ఎస్టీపీల్లో దాదాపు సగం కేంద్రాలది ఇదే పరిస్థితి అని తెలుసుకుంది. హైడ్రా నిబంధనల నేపథ్యంలో ఎస్టీపీలు నిర్మించనున్న ప్రాంతాలపై అధికారులు మరోసారి సమీక్ష చేశారు. ఈ కేంద్రాల్లో ఎక్కువ శాతం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లల్లో ఉండటంతో అప్రమత్తమయ్యారు. చెరువులకు దూరంగా నిర్మించేందుకు కొత్త స్థలాల ఎంపికపై కసరత్తు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అమృత స్కీంలో భాగంగా ప్రభుత్వంతోపాటు గుత్తేదారు భాగస్వామ్యం కింద హైబ్రిడ్ యాన్యుయిటీ పద్ధతి(హామ్)లో కొత్తగా 39 ఎస్టీపీలను నిర్మించనున్న సంగతి తెలిసిందే. అవుటర్ రింగ్‌రోడ్డు వరకు మురుగు కలిసే మూసీతో పాటు చెరువులు, కుంటల వద్ద వీటిని ఏర్పాటుచేయనున్నారు. మరో వారంలో టెండర్లను ఆహ్వానించేందుకు జలమండలి సిద్ధమవుతోంది. మొత్తం రూ. 3849.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు. కేంద్రం నుంచి 40శాతం.. అమృత స్కీంతోపాటు హామ్ మోడల్ కింద కేంద్రం 40 శాతం, గుత్తేదారు సంస్థ, జలమండలి కలిసి 60 శాతం నిధులు వెచ్చిస్తాయి. పనులు పూర్తిచేసిన తర్వాత గుత్తేదారు పెట్టిన మొత్తాన్ని వాయిదాల పద్ధతిలో తిరిగి జలమండలి చెల్లించనుంది. భూసేకరణ ఇబ్బంది లేకుండా ప్రభుత్వ భూముల్లో చిన్నచిన్న కేంద్రాలను ఎక్కువ ప్రాంతాల్లో నిర్మించనున్నారు. వీటిలో చాలా వరకు చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్‌లో నిర్మించేందుకు తొలుత



ప్రణాళిక సిద్ధంచేశారు. సర్వే లేకుండానే ఈ స్థలాలను ఎంపిక చేశారు. ఇటీవల హైడ్రా కార్యాచరణ నేపథ్యంలో జలమండలి మరోసారి వీటిని పరిశీలించడంతో అసలు విషయం తెలిసింది. దీంతో తాజాగా చెరువులకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లకు దూరంగా ఉండేలా చూస్తున్నామని ఓ అధికారి తెలిపారు.

కేంద్రాలు ఏర్పాటయ్యే ప్రాంతాలు: అమీన్‌పూర్, నేరెల్ల, ఇక్రిశాట్, ఉస్కెబావి, బాచుగూడ, తిమ్మక్కచెరువు, గండిగూడెం, గౌడవల్లి, పొతాయ్‌పల్లి లేక్, నవకుంట లేక్, పీర్జాదిగూడ, కొర్రెముల, నాగారం లేక్, చీర్యాల లేక్, కుందన్‌పల్లి, యామ్నంపేట్, కుంట్లూరు, గౌరెల్లి, ఎదులచెరువు, పల్లెచెరువు, ఉమ్దాసాగర్, బండ్లగూడ, గుర్రంచెరువు, మీర్‌పేట్ తలాబ్ ఎస్టీపీ, సాధనచెరువు, రావిర్యాల, బొంగులూరు, మాసబ్‌చెరువు, కొత్వాల్‌గూడ, కామునిలేక్, నల్లచెరువు-2, కాప్రా, హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్, ఫతేనగర్-2, చిత్రపురి, నార్సింగ్(ఓఆర్ఆర్), హైదర్షాకోట్, సంగం(బాపూఘాట్), పటేల్‌చెరువు.

## యాసంగి పంట ప్రణాళిక ఖరారు

నల్గొండ : నల్గొండ జిల్లాలో యాసంగి పంటల సాగునకు సంబంధించి వ్యవసాయశాఖ కార్యాచరణ ప్రణాళిక ఖరారు చేసింది. 2024-25లో 5,83,620 ఎకరాల్లో రైతులు సాగు చేస్తారని అంచనా వేసింది. ఈ మేరకు అవసరమైన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచింది. జిల్లాలో 90 శాతం చెరువులు, సాగర్, మూసీ, జలాశయాలు వర్షాకాలంలో పూర్తిగా నిండాయి. ఈ నేపథ్యంలో భూగర్భ జలమట్టం పెరిగింది. బోర్లు, బావుల్లో సాగుకు సరిపోను నీరు లభిస్తుంది. ఈ సందర్భంగా ఏ మండలంలో ఎన్ని ఎకరాల్లో పంటలు సాగు చేస్తారనే విషయంలో నిర్దేశిత లక్ష్యాన్ని అధికారులు రూపొందించారు.

రాయితీ లేదు..ఎక్కువగా సాగు చేసే వరితో పాటు వేరుశనగ, మినుము, పెసర, ఆముదం, జొన్న, సజ్జ విత్తనాలకు ప్రభుత్వం రాయితీ ఇంత వరకు ప్రకటించలేదు. దీంతో ప్రయివేటు వ్యాపారుల వద్ద కొనాల్సి వస్తోంది. వారు ఇష్టం వచ్చిన ధరకు విక్రయించే అవకాశం



ఉంది.వరి సాగునే అధికంగా..

జిల్లాలో సాగుకు భూములు అనుకూలంగా మారాయి. ప్రాజెక్టుల, బోరు బావుల కింద వరి సాగుకు మొగ్గు చూపుతున్నారు. అధికారులు మాత్రం ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచనలు చేస్తున్నారు. నల్గొండ నియోజకవర్గంలోనే ముందస్తుగా వానాకాలం వరి కోతలు ప్రారంభించారు. మిగిలిన నియోజకవర్గాల్లో నవంబరు, డిసెంబరులో వరి కోతలు మొదలవుతాయి. ఎక్కడ ముందస్తుగా కోతలు మొదలవుతాయో అక్కడ విత్తనాలు సిద్ధంగా ఉంచేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని సంబంధిత అధికారులు తెలిపారు.

విత్తనాలు సిద్ధం..: పాల్వాయి శ్రవణ్ కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, నల్గొండయాసంగిలో పంటల సాగుకు అనుకూల వాతావరణం ఉంది. సమృద్ధిగా వర్షాలు కురవడంతో బోర్లు, బావుల్లో నీటి మట్టాలు పెరిగాయి. అన్ని రకాల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి.

## ఉల్లి పంటపైనే ఆశలు

నారాయణఖేడ్ : ఈ సారి పుష్కలంగా వర్షాలు కురియడంతో బోరు, బావుల్లో నీటి మట్టం పెరిగింది. ప్రస్తుతం ఉల్లి పంటకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉండటంతో సాగుపై రైతన్నలు మొగ్గుచూపుతున్నారు. ఖరీఫ్‌లో వేసిన పెసర, మినుము, సోయా పంటలకు అధిక వర్షాలతో నష్టం వాటిల్లింది. ఆ భూముల్లో ఉల్లి పంట వేస్తే ఆదుకుంటుందని రైతులు మొగ్గుచూపుతున్నారు. భూములను దుక్కులు చేసి నాట్లకు ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటికే ఉల్లి నారును పెంచారు. ఈ పంట 100 రోజుల్లో చేతికి వస్తుండటంతో తక్కువ వ్యవధిలో ఎక్కువ లాభం వస్తుందనే ఆశతో రైతులు ఉల్లిసాగుపై మొగ్గు చూపుతున్న తీరుపై ప్రత్యేక కథనం.

ఇదీ సంగతి: జిల్లాలో నారాయణఖేడ్, జహీరాబాద్, అందోలు నియోజకవర్గాల్లో ఉల్లిపంట అధికంగా సాగు చేస్తుంటారు. ఇందులో తుమ్నూర్, రాణాపూర్, ఎల్గోయి, దుద్‌గొండ, దోసపల్లి, మాయికోడ్, జి.హెూక్రాన, పంచాగామ, పిప్రి, ముగ్దుంపూర్, ఉట్‌పల్లి, శెల్గిర, డొవ్వూర్ తదితర గ్రామాల్లో ఎక్కువ సంఖ్యలో ఉల్లి సాగవుతుంది. గతం కంటే ఈసారి వర్షాలు సంవృద్ధిగానే కురియడంతో మనూరు మండలంలో పారుతున్న మంజీర నది పరిసరాల్లోనూ పంట సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. గత సంవత్సరం వట్టిపోయిన బోరు, బావుల్లో ఈసారి పుష్కలంగా నీరుంది. ప్రతీ ఏడాది నారాయణఖేడ్ నియోజకవర్గంలో సుమారు 2వేల ఎకరాల వరకు ఉల్లి పంట సాగవుతుండగా ఈసారి వర్షాలు ఎక్కువగా కురియడంతో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

సాగు విధానం: మొదట ఉల్లి పంట సాగు చేయాలంటే భూమిని



చదును చేసి ఉల్లి విత్తనాలు చల్లాలి. తదుపరి 45 రోజులకు నారు వేసుకోవచ్చు. నాటు వేసిన 100 రోజులకు పంట కోతకు వస్తుంది. పంట వేసిన నుంచి కోతకు వచ్చే వరకు రెండుసార్లు కలుపు తీయాల్సి ఉంటుంది. రెండు మార్లు పోటాష్, డీఏపీ, యూరియా తదితర ఎరువులు చల్లాల్సి ఉంటుంది. రెండు కిలోల విత్తనాలకు ఒక ఎకరం వరకు వేసుకోవచ్చు. ఒక ఎకరంలో పంట బాగా పండితే సుమారు 70 నుంచి 80 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తుంది. ఎకరాకు రూ. 25 వేల వరకు పెట్టుబడులకు ఖర్చవుతుంది. ఈసారి కిలో ఉల్లి విత్తనాలకు రూ. 800 నుంచి రూ. 1000 వరకు అమ్ముతున్నారు. తక్కువ వ్యవధి ఎక్కువ ఆదాయం వచ్చే పంట కావడంతో కొత్త రైతులు కూడా ఉల్లి పంట సేద్యానికి మొగ్గుచూపుతున్నారు. వర్షాలతో పంటలు నష్టపోయిన వారంతా ఉల్లి నాట్లలో నిమగ్నమయ్యారు.

వర్ష నష్టం పూడ్చుకుందామని!

ఈసారి అధిక వర్షాలతో పెసర, మినుము, సోయా తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. ప్రస్తుతం బోరు బావుల్లో సమృద్ధిగా నీరు రావడంతో ఉల్లి గట్టెక్కిస్తుందని అన్నదాతలు సాగు చేస్తున్నారు. నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. కూలీలకు చేతినిండా పని ఉండటంతో సత్తృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## నాసిరకం పనులకు వేదిక!

టేకులపల్లి : వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ.. వారికి సలహాలు, సూచనలు ఇచ్చేలా గత ప్రభుత్వం రైతు వేదికలను ప్రతిష్ఠాత్మకంగా నిర్మించింది. ఇంత వరకు బాగానే ఉన్నా, నిర్మాణ పనుల్లో గుత్తేదారులు నాణ్యత పాటించక పోవడంతో వాటి నిర్మాణాలు అప్పుడే దెబ్బతిన్నాయి. టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్‌లో సుమారు 30 లక్షలతో రైతు వేదికను నిర్మించారు. దీని వరండాలు రెండువైపులా కుంగిపోయి ప్రమాదకరంగా తయారయ్యాయి. నెర్రెల్లో పాములు చేరి బుసలు కొడుతుండటంతో అధికారులు, అక్కడకు వచ్చే రైతులు భయపడుతున్నారు. మండలంలోని బోడు, ఇతర రైతు వేదికల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. "ఇల్లెందు డివిజన్‌లో మొత్తం నాలుగు రైతు వేదికల్లో మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. దీనికి సంబంధించి ప్రతిపాదనలు చేయాలని పంచాయతీ రాజ్ అధికారులను కోరాం. దెబ్బతిన్న నిర్మాణాల పటిష్ఠతకు చర్యలు తీసుకుంటా" అని వ్యవసాయ శాఖ ఇల్లెందు డివిజన్ అధికారి లాల్‌చంద్ అన్నారు.




## బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ బాలినేని సవాల్

హైదరాబాద్: తాను విలువలతో రాజకీయాలు చేసే వ్యక్తినని జనసేన నేత, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తనకు రాజకీయ భిక్ష పెట్టినట్లు జనసేనలో చేరినప్పుడే చెప్పానని తెలిపారు.

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మెప్పు కోసమే తాను మాట్లాడుతున్నట్లు వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బాలినేని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్‌పై అభిమానంతో ఆయన మరణం తర్వాత మంత్రి, ఎమ్మెల్యే పదవులు వదులుకొని వైకాపాలోకి వెళ్లానని బాలినేని గుర్తుచేశారు. రాజశేఖర్‌రెడ్డి కుటుంబమంటే జగన్ ఒక్కరేనా? విజయమ్మ, షర్మిల కాదా అని ప్రశ్నించారు. వారిపై అసభ్య పోస్టులు పెడితే ఆ కుటుంబం కానట్లు పట్టించుకోరా? అని బాలినేని నిలదీశారు. తాను ఎవరి మెప్పు కోసం పనిచేయడం లేదని.. ఈవిషయాన్ని చెవిరెడ్డి గుర్తుపెట్టుకోవాలన్నారు. తిట్టిన వాళ్లకే టికెట్లు ఇస్తామనే సంప్రదాయం ఎవరు కొనసాగిస్తున్నారో తెలుసని వ్యాఖ్యానించారు. “ఎవరినీ విమర్శించను అని చెప్పా.. అలా చేస్తే నేను కూడా వాస్తవాలు చెప్పాల్సి వస్తుంది. అదానీతో విద్యుత్ ఒప్పందాల్లో రూ.1,750 కోట్ల లంచం తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. అప్పట్లో విద్యుత్ మంత్రిగా ఉన్నందున ఏం జరిగిందో చెప్పాను. సెకీతో ఒప్పందం అంశంలో నాకు ఏమాత్రం సంబంధం లేదు. సీఎండీ ఫైల్ కూడా నా వద్దకు రాలేదు.

చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఏం తెలుసని మాట్లాడుతున్నారు. నేను వ్యక్తిగత విమర్శలు చేస్తే ఎవరూ తట్టుకోలేరు. పవన్ వెంట ఉంటూ కూటమితో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాను. చిత్తూరు జిల్లా అధ్యక్షుడిని తీసుకొచ్చి ఒంగోలులో టికెట్ ఇస్తారా? అలా చేయడం నాకు నచ్చలేదు. అందుకే దానికి అంగీకరించలేదు. వైకాపా నుంచి ఎందుకు బయటకు వెళ్లాల్సి వచ్చిందో మొత్తం చెబుతా. ధైర్యం ఉంటే చెవిరెడ్డి బహిరంగ చర్చకు రావాలి” అని బాలినేని సవాల్ విసిరారు.

## అర్ధరాత్రి జగన్ అనుమతుల వెనుక దర్యాప్తు జరగాలి: సీఎం చంద్రబాబుకు షర్మిల లేఖ

అమరావతి: అదానీతో మాజీ సీఎం జగన్ చేసుకున్న విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలను రద్దు చేయాలని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు ఆమె లేఖ రాశారు. “అదానీతో ఒప్పందం రాష్ట్రానికి పెను భారం. అక్రమ డీల్ కారణంగా పాతికేళ్లపాటు ప్రజలపై రూ.లక్షన్నర కోట్ల భారం పడుతుంది.

అర్ధరాత్రి అనుమతుల వెనుక దర్యాప్తు జరగాలి. ఒప్పందాలను రద్దు చేసి, ఆ కంపెనీని వెంటనే బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలి. ఒప్పందాలపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి. గంగవరం పోర్టును అదానీకి అప్పగించడంపైనా విచారణ జరగాలి” అని లేఖలో షర్మిల పేర్కొన్నారు.



## అదానీతో కుమ్మక్కైన జగన్‌పై చర్యలేవీ?: బీవీ రాఘవులు



విజయవాడ: అదానీ గ్రూప్ నుంచి లంచం తీసుకున్నారనే ఆరోపణలపై వైకాపా అధ్యక్షుడు జగన్‌ను ఈడీ ఎందుకు ప్రశ్నించడం లేదని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ప్రశ్నించారు. అదానీ విద్యుత్ ఒప్పందాల్లో ముడుపుల వ్యవహారం అతిపెద్ద కుంభకోణం అన్నారు. అదానీతో జగన్ కుమ్మక్కై ప్రజలపై భారం మోపేలా చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని సీఎం చంద్రబాబును రాఘవులు కోరారు. పార్టీ నేతలు ఎంఏ బేబీ, వి.శ్రీనివాసరావుతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. ప్రతిపక్షాలపై ఈడీ, సీబీఐని ప్రయోగించే ప్రధాని నరేంద్ర మోదీ.. జగన్‌ను ఎందుకు వదిలేశారని రాఘవులు నిలదీశారు. అదానీ, జగన్ కుమ్మక్కు వ్యవహారాలపై విచారణ జరిపించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అలాగే, ముడుపుల వ్యవహారంపై పార్లమెంటు సమావేశాల్లో చర్చించి జేపీసీతో విచారణ జరిపించాలన్నారు.




## నన్ను దారుణంగా చిత్రవధ చేశారు..చంపాలని చూసారు

న్యూఢిల్లీ: రఘురామకృష్ణంరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో సీఐడీ మాజీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్‌కు సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన నేపథ్యంలో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ విజయ్‌పాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ధర్మాసనం తీర్పుపై స్పందించిన ప్రస్తుత ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణం రాజు మాట్లాడుతూ.. తన కస్టోడియల్ టార్చర్ కేసులో సీఐడీ మాజీ అదనపు ఎస్పీ విజయ్ పాల్ బెయిల్‌ను సుప్రీంకోర్టు రద్దు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. తనను దారుణంగా చిత్రవధ చేశారని.. చంపాలని చూసారని అన్నారు. అందుకు సాక్ష్యంగా మిలటరీ ఆసుపత్రి నివేదికలున్నాయన్నారు. న్యాయం గెలుస్తుందన్నారు. త్వరలో తన కస్టోడియల్ టార్చర్ కేసులో ఉన్న పెద్దవారంత బయటకు వస్తారన్నారు. తాను ఇప్పుడు ఏ పార్టీపై విమర్శలు చేయనని.. తన కేసు గురించి మాట్లాడే హక్కు తనకుందని రఘురామ కృష్ణంరాజు అన్నారు. సభలో శాసన సభ్యులకు ఇవ్వాల్సిన గౌరవం ఇస్తానని, శాసన సభా సమావేశాలు సంతృప్తికరంగా జరిగాయన్నారు. గుజరాత్, సిక్కిం, ఈశాన్య రాష్ట్రాల్లో ప్రతిపక్ష హోదాలు లేవని, మహారాష్ట్రలో కూడా ప్రతిపక్ష హోదా ఉండదని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి సభకు వస్తే ఆయనకు సమయం ఇవ్వడం జరుగుతుందని, ఇంట్లో కూర్చుని మాట్లాడే బదులు ఆయన సభకు వచ్చి మాట్లాడొచ్చుకదా అని అన్నారు. జగన్ సభకు రావలన్నది ప్రజల ఆకాంక్ష అని... ఆయన కాంక్ష తీరలేదని అందుకే సభకు రావడం లేదని రఘురామ కృష్ణంరాజు వ్యాఖ్యానించారు.

## శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి ఘటన.. విచారణ ముమ్మరం చేసిన సిట్

తిరుమల: శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వివాదంపై సిట్ విచారణ సాగుతోంది. ఈమేరకు తిరుమలలో రెండు రోజులుగా దర్యాప్తు చేస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ అధికారులతో కలిసి ఇటీవల సిట్ ఏర్పాటుచేశారు. సీబీఐ అధికారుల పర్యవేక్షణలో ఈ విచారణ సాగుతోంది. మూడు బృందాలుగా ఏర్పడి అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే తమిళనాడు దిండిగల్ ఏఆర్ డెయిరీలో సిట్ బృందం సభ్యులు వివరాలు సేకరించారు. తిరుపతిలోని తితిదే మార్కెటింగ్ గోదాములను పరిశీలించారు. నెయ్యి కొనుగోలు టెండర్ల దస్త్రాలపై ఆరా తీశారు. తిరుపతి తూర్పు పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసు ఆధారంగా సిట్ విచారణ సాగుతోంది.






హైదరాబాద్ : వివాదాస్పద దర్శకుడు రాంగోపాల్‌వర్మ (ఆర్జీవీ) అరెస్టుకు రంగం సిద్ధమైంది. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన ఇంటికి ఏపీలోని ఒంగోలు పోలీసులు చేరుకున్నారు. ఇవాళ ఒంగోలు రూరల్ పీఎస్‌లో విచారణకు ఆర్జీవీ వెళ్లాల్సి ఉంది. ఆయన హాజరుకాకపోవడంతో అరెస్ట్ చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ‘వ్యూహం’ సినిమా ప్రమోషన్ సమయంలో తెదేపా అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వ్యక్తిత్వాలను కించపరిచేలా సామాజిక మాధ్యమం వేదికగా రాంగోపాల్ వర్మ పోస్టులు పెట్టారంటూ ప్రకాశం జిల్లా మద్దిపాడు మండల తెదేపా ప్రధాన కార్యదర్శి రామలింగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా పోలీసులు వర్మపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలంటూ ఆర్జీవీ ఏపీ హైకోర్టును ఆశ్రయించగా ఆయనకు చుక్కెదురైంది. అరెస్ట్ నుంచి రక్షణ కల్పించలేమని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈనెల 19న విచారణకు హాజరు కావాల్సి ఉండగా.. తనకు 4 రోజుల సమయం కావాలంటూ రాంగోపాల్ వర్మ అదేరోజు వాట్సప్‌లో ఒంగోలు పోలీసులకు సమాచారం పంపారు. అనంతరం 25న ఉదయం విచారణకు హాజరుకావాలంటూ మరోసారి ఆర్జీవీకి నోటీసులు పంపారు. గడువు ముగిసినా విచారణకు హాజరుకాకపోవడంతో అరెస్ట్ చేసేందుకు ఆయన నివాసానికి పోలీసులు వెళ్లారు. అయితే రాంగోపాల్‌వర్మ తమిళనాడులోని కోయంబత్తూరులో ఉన్నట్లు సమాచారం.

**కోయంబత్తూరు, ముంబయికి పోలీసు బృందాలు...** ఆర్జీవీ హైదరాబాద్‌లో లేరని.. సినిమా షెడ్యూల్ ప్రకారం ఇతర ప్రాంతాల్లో ఉన్నట్లు ఇంటివద్ద ఉన్న సిబ్బంది పోలీసులకు తెలిపారు. మరోవైపు ఆయన తరపు న్యాయవాది మీడియాతో మాట్లాడుతూ విచారణకు సహకరిస్తామని.. కొద్దిరోజుల సమయం కావాలని పోలీసులను కోరినట్లు తెలిపారు. సినిమా పనుల్లో భాగంగా రాంగోపాల్ వర్మ వేరే ప్రాంతంలో ఉండటంతో వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతి కోరినట్లు చెప్పారు. రెండోసారి కూడా విచారణకు హాజరుకాకపోవడంతో అరెస్ట్ చేసేందుకే పోలీసులు సిద్ధమవుతున్నారు. ఈక్రమంలో కోయంబత్తూరు, ముంబయికి రెండు బృందాలు వెళ్లాయి. అయితే ఆర్జీవీ సోషల్ మీడియా అకౌంట్స్ హ్యాండిల్స్ లోకేషన్ హైదరాబాద్ పరిధిలో చూపిస్తుండటంతో శంషాబాద్, షాద్‌నగర్‌లోని రెండు ఫాంహౌస్‌లపై పోలీసులు దృష్టిసారించారు. సాయంత్రంలోపు రాంగోపాల్‌వర్మను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

## వైసీపీలో వారిని విడిచిపెట్టే ప్రసక్తే లేదు... మంత్రి కొల్లు రవీంద్ర వార్నింగ్

కృష్ణాజిల్లా, (మచిలీపట్నం) : జగన్ ప్రభుత్వం అమరావతిని పూర్తిగా నిర్వీర్యం చేసిందని మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన అన్ని రంగాలను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. జగన్ సర్కార్ స్వార్థపూరిత రాజకీయాలతో పోలవరం ప్రాజెక్ట్ గత ఐదేళ్లలో చాలా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలు విజయవంతంగా జరిగాయని అన్నారు. అసెంబ్లీ సమావేశాలకు గైర్హాజరైన మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి చట్టసభలను, రాజ్యాంగాన్ని అవమానించారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అసెంబ్లీలో తాము జవాబుదారీతనంగా వ్యవహరించామని అన్నారు. ప్రభుత్వ విధి విధానాలను అసెంబ్లీ వేదికగా ప్రజలకు తెలియజేవామని చెప్పారు. రూ.2.97కోట్ల రాష్ట్ర బడ్జెట్‌ని ప్రవేశ పెట్టామని చెప్పుకొచ్చారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు చాలా సంస్థలు వస్తున్నాయని తెలిపారు. మానవవనరులను సక్రమంగా వినియోగించగల వ్యక్తి చంద్రబాబు అని కొనియాడారు. కృష్ణాజిల్లా అభివృద్ధికి ఎమ్మెల్యేలు అందరితో కలిసి ముందుకు వెళున్నామని చెప్పారు. ఆగిపోయిన బందరు పోర్టు, ఫిషింగ్ హార్బర్ పనులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ఇది కలియుగం... కర్మ ఫలం ఎవరినీ వదలదని హెచ్చరించారు.




ఈ జన్మలో చేసిన పాపాలకు కర్మ ఫలం ఈ రోజుల్లోనే అనుభవించే రోజులు వచ్చాయన్నారు. వారు చేసిన పాపాలే వారికి శాపాలుగా తగులుతున్నాయని చెప్పారు. తమను జైళ్లలో పెట్టించి శునకానందం పొందారని మండిపడ్డారు. ప్రజాతీర్పుతోపాటు చట్టం కూడా తనపై తాను చేసుకుంటుందని అన్నారు. కారుకూతలు కూసే వారిని వదిలేది లేదని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.




## అదానీ కేసులో ఇరుక్కొన్న జగన్: గోనె ప్రకాశ్ రావు

అదానీ ఇష్యూలో వైఎస్ జగన్ ఇరుక్కున్నారని సీనియర్ నేత గోనె ప్రకాశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ కేసు నుంచి జగన్ బయట పడటం కష్టం అని స్పష్టం చేశారు. ముడుపుల కేసులో జగన్, అదానీ ఇద్దరు అరెస్ట్ అవుతారని వివరించారు. వారిద్దరీ అరెస్ట్‌ను ప్రధాని మోదీ కూడా అడ్డుకోలేరని సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పవర్ ప్రాజెక్ట్ కోసం అదానీ సంస్థ జగన్ ప్రభుత్వానికి ముడుపులు అందజేసిందని అమెరికా ఆరోపించింది. దాంతో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ముడుపుల వ్యవహారం అగ్గిరాజేసింది.

## చివరి కార్తీక సోమవారం.. భక్తులతో ఆలయాలు కిటకిట..




అమరావతి: హిందువులు ఎంతో పవిత్రంగా భావించే కార్తీక మాసం.. అన్ని మాసాలతో పోలిస్తే కార్తీక మాసం చాలా పవిత్రమైంది. పూజలు, వ్రతాలు, ఉపవాసాలు, వనభోజనాలతో నెలంతా భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోతారు. తెల్లవారుజామునే కార్తీక స్నానమాచరించి.. కార్తీక దీపం వెలిగిస్తారు. కాగా నవంబర్ 2వ తేదీన ప్రారంభమైన కార్తీక మాసం సోమవారం (ఈరోజు)తో ముగుస్తుంది. చివరి సోమవారం కావడంతో రాష్ట్రంలోని అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి.

**పశ్చిమగోదావరి..** పంచారామ క్షేత్రం పాలకొల్లులోని క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. తెల్లవారుజాము నుంచి స్వామి వారి మూలవిరాట్‌కు అభిషేకాలు జరుగుతున్నాయి. భక్తులు దీపోత్సవాలు చేస్తున్నారు. కార్తీకమాసం ఆఖరి సోమవారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేస్తున్నారు.

**విశాఖపట్నం..** కార్తీక మాసం చివరి నాల్గవ సోమవారం సందర్భంగా నగరంలోని శివాలయాలు భక్తులతో కళకళలాడుతున్నాయి. వేకువజామునుంచే శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతున్నాయి. సింహాచలం కొండపై స్వయంభుగా వెలసిన త్రిపురాంతక స్వామివారిని భక్తులు దర్శించుకుంటున్నారు. మహిళలు ఆలయాల ముందు కార్తీక దీపాలు వెలిగించి.. ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

**నంద్యాలలో..** కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో శ్రీశైలం మల్లన్న ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునుంచే భక్తజనం పాతాళగంగలో పుణ్యస్నానాలను ఆచరిస్తున్నారు. గంగాధర మండపం వద్ద, మాడవీధులలో పలుచోట్ల కార్తీక దీపాలను వెలిగించి భక్తులు మొక్కలు తీర్చుకుంటున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా భక్తులందరికీ శ్రీస్వామివారి అలంకార దర్శనానికి మాత్రమే అధికారులు అనుమతి ఇస్తున్నారు. శ్రీస్వామి అమ్మవారి దర్శనానికి సుమారు 6 గంటల సమయం పడుతోంది.

**అంబేద్కర్ కోనసీమ జిల్లా...ద్రాక్షారామం....** కార్తీక మాసం నల్గవ సోమవారం కావడంతో శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామునుంచి సప్తగోదావరిలో నదిలో పుణ్య స్నాన మాచరించి భక్తులు శ్రీ అమ్మ వారిని శ్రీ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

**కాకినాడ జిల్లా..** కార్తీక మాసంతో దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయా క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. కార్తీక మాసం నల్గొవ సోమవారం తెల్లవారుజాము నుంచే పాదగయ పుష్కరిణిలో భక్తులు పుణ్య స్నానమాచరించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. రాజరాజేశ్వరి సమేత ఉమా కుక్కుటేశ్వర స్వామి వారికి, పురుహూతిక అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## ట్రెడిషనల్ లుక్స్ తోనే భాగ్యశ్రీ హై గ్లామర్ ట్రీట్

తెలుగు సినిమా రంగంలో తన ప్రత్యేకమైన అందంతో యువత హృదయాలను గెలుచుకున్న భాగ్యశ్రీ బోర్సే, తాజాగా మరోసారి తన సోషల్ మీడియాలో ప్రత్యేకమైన లుక్స్ తో ఆకట్టుకుంటోంది. గుండెల్ని తాకే ఎరుపు డ్రెస్ లో భాగ్యశ్రీ చూపిన స్టిల్ ప్యూర్ మ్యాజిక్ అని చెప్పొచ్చు. ఈ ఫోటోల్లో ఆమె చూపులు, చిరునవ్వు నెటిజన్లను మంత్రముగ్ధులను చేశాయి. భాగ్యశ్రీ కెరీర్ హిందీ చిత్రం యారియాన్ 2 ద్వారా ప్రారంభమైంది. ఆ తర్వాత తెలుగులో హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన మిస్టర్ బచ్చన్ చిత్రంతో పరిచయం అయింది. ఈ చిత్రంలో భాగ్యశ్రీ తన గ్లామర్ ప్రెజెన్స్‌తో యూత్‌ని బాగా ఆకర్షించింది. అయితే ఈ సినిమా ఆశించిన విజయం సాధించకపోయినప్పటికీ ఆమె అందానికి ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ తగ్గలేదు. ప్రస్తుతం భాగ్యశ్రీ విజయ్ దేవరకొండ ప్రధాన పాత్రలో రూపొందుతోన్న పాన్-ఇండియా చిత్రం %ఎఱ%12లో కథానాయికగా నటిస్తూ మరింత గుర్తింపును అందుకునే దిశగా



అడుగులు వేస్తోంది. అలాగే రామ్ పోతినేని తో కూడా ఒక సినిమా చేసేందుకు సిద్ధమైంది. అమ్మడు ఇండస్ట్రీలో గట్టిగానే ఆఫర్స్ అందుకుంటోంది. ఇక లేటెస్ట్ ఫోటోషూట్‌లో భాగ్యశ్రీ ఎరుపు డ్రెస్ లో సంప్రదాయిక లుక్స్ తో పాటు, లేటెస్ట్ గ్లామర్ హంగులతో ఆకట్టుకుంటోంది. ఆమె బొంగురు జుట్టు, తేలికైన ఆభరణాలు ఆమె లుక్‌కు అదనపు ఆకర్షణను తెచ్చిపెట్టాయి. ప్రస్తుతం ఆమె దుల్కర్ సల్మాన్, రానా దగ్గుబాటి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న మరో చిత్రంలో కూడా నటించనుంది. భాగ్యశ్రీ తన ఫోటోషూట్‌లతో, నిత్యం సోషల్ మీడియా ద్వారా అభిమానులను మెప్పించడంలో ముందుంది. ఈ లేటెస్ట్ ఫోటోలు ఆమె వింటేజ్ అందానికి ఒక నిదర్శనమని చెప్పుకోవచ్చు. ఆమె కెరీర్‌లో సక్సెస్ ల్యాండ్‌మార్క్ సాధిస్తే, భాగ్యశ్రీని నెక్ట్స్ జనరేషన్ స్టార్ హీరోయిన్‌గా వెలుగుతుందని చెప్పవచ్చు. ఎందుకంటే ప్రస్తుతం ఇండస్ట్రీలో హీరోయిన్స్ కొరత ఉంది. సీనియర్ బ్యూటీలు ఫామ్ లో లేరు. సక్సెస్ ట్రాక్ లో ఉన్న బ్యూటీలు బిజీగా ఉన్నారు. కాబట్టి ఓ వర్గం హీరోలకు హీరోయిన్స్ కావాల్సి ఉంది. ఈ తరుణంలో భాగ్య శ్రీకి మంచి అవకాశాలు వచ్చే ఛాన్స్ ఉంది. ఇక తన ఫోటోల ద్వారా భాగ్యశ్రీ అందం, అభినయం రెండింటినీ బలంగా చాటుతోంది. మరి ఆమె తర్వాతి చిత్రాలు మరింత గుర్తింపు తీసుకువస్తాయో లేదో చూడాలి!

## ఇది అర్థం చేసుకుంటే సమస్యే ఉండదు: అల్లు అర్జున్

తెలుగులో ఎక్కువ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న హీరోలలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఒకరనే సంగతి అందరికి తెలిసిందే. పుష్ప మూవీ తర్వాత బన్నీకి దేశ వ్యాప్తంగా ఫాలోయింగ్ పెరిగింది. 'పుష్ప 2' మూవీ ట్రైలర్ రిలీజ్ సందర్భంగా పాట్నా వెళ్లిన ఆయనకి అపూర్వ స్వాగతం లభించింది. దీనిని బట్టి బన్నీకి ఎంత క్రేజ్ ఉందో అర్ధం చేసుకోవచ్చు. ఇండియాలోనే స్టైలిష్ బ్రాండ్ అంబాసిడర్ గా ఐకాన్ స్టార్ ని చూస్తారు. అతను వేసే కాస్ట్యూమ్స్ ని యూత్ ఎక్కువగా ఇష్టపడుతూ ఉంటారు. అలాగే అతని ఐడియాలజీని కూడా అనుసరించడానికి ప్రయత్నం చేస్తారు. ఇదిలా ఉంటే బన్నీని ఇప్పటి వరకు ఒక హీరోగా, స్టార్ గా చూసి అభిమానించేవారు అతని నమ్మే ఫిలాసఫీని కూడా ఫాలో అయితే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. రీసెంట్ 'అన్ స్టాపబుల్ సీజన్ 4' టాక్ షోలో అల్లు అర్జున్ పాల్గొన్నారు. ఆయనకి సంబంధించి ఎపిసోడ్ 4 పార్ట్ 2లో బాలయ్యతో బన్నీ చాలా ఆసక్తికరమైన అంశాలు పంచుకున్నారు. సినిమాలు, వ్యక్తిగత జీవితం గురించి ఓపెన్ అయ్యారు. అలాగే అతను



నమ్మే ఫిలాసఫీ ఏంటనేది కూడా చెప్పాడు. ఇప్పుడు ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇంత బ్లడ్ రిలేషన్ అయిన కూడా డిఫరెన్స్ ఆఫ్ ఒపీనియన్స్ ఉంటాయని అన్నారు. నేను ప్రపంచంలో అందరికంటే ఎక్కువగా ప్రేమించే మా నాన్న, నేను ఒకే ఇంట్లో ఉంటాం. ఆయన చెప్పేది నేను ఫాలో అవుతాను. అయినా కూడా మా ఇద్దరి మధ్య డిఫరెన్స్ ఆఫ్ ఒపీనియన్స్ ఉంటాయి. నేను ఆ అంశాన్ని ఎలా చూస్తానంటే, మన ఇద్దరికి కేవలం ఈ సబ్జెక్టులో పడదు. అది ఆ సబ్జెక్ట్ వరకే ఉంటుంది. నీకు నాకు మధ్య కాదు. అందరూ రిలేషన్ షిప్ లో చేసే తప్పు ఇదే%% సపోజ్ నేను ఎవరైనా చెప్పే విషయానికి నో చెబితే, అదేదో వారికి నో చెప్పినట్లు ఫీల్ అవుతారు. నేను నీకు చెప్పలేదు. ఆ సబ్జెక్ట్ కి మాత్రమే నో చెప్పాను. ఇది అర్థం చేసుకుంటే 99% రిలేషన్స్ లో ఎలాంటి సమస్యలు రావని బన్నీ చెప్పుకొచ్చారు. అల్లు అర్జున్ చెప్పిన ఈ లైఫ్ ఫిలాసఫీ ప్రతి ఒక్కరి జీవితానికి అన్వయించుకోవచ్చనే కామెంట్స్ సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. అయితే కొంతమంది మాత్రం దీనిని మరో రకంగా అర్థం చేసుకొని ట్రోల్ చేస్తున్నారు. ఏది ఏమైనా బన్నీ చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.








## 'పుష్ప' బాటలోనే 'డాకు మహారాజ్' అమెరికాకు?

నటసింహ నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్ 12 జనవరి 2025న థియేటర్లలో విడుదల కానుంది. ఈ చిత్రానికి బాబీ కొల్లి దర్శకత్వం వహించారు. ఇందులో బాలయ్యతో పోటీపడుతూ.. విలన్ గా యానిమల్ అబ్రార్ పాత్రధారి బాబీ నటించాడు. డాకు మహారాజ్ చిత్రీకరణను పూర్తి చేసినని బాబీ తాజా ఇంటర్వ్యూలో తెలిపాడు. డాకు మహారాజ్ టీజర్ ఇటీవల విడుదలై అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంది. ఫస్ట్ లుక్ వీడియోలో %చీడీఖ% డాకాయిట్ అవతార్‌లో దూకుడుగా కనిపించారు. అందుకే ఈ చిత్రానికి డాకు మహారాజ్ అనే టైటిల్ పెట్టారు. మునుపెన్నడూ లేని విధంగా మాస్ దేవుడి సాక్షిగా! ఎనందమూరి బాలకృష్ణ గారిని ఎడాకుమహారాజ్ గా ప్రెజెంట్ చేస్తున్నాను! అని దర్శకుడు బాబి అన్నారు. తాజా సమాచారం మేరకు ఈ సినిమా ప్రీరిలీజ్ వేడుకను అమెరికాలో ప్లాన్ చేసారని సమాచారం. 2025 జనవరి 4న టెక్సాస్ -డల్లాస్‌లో అత్యంత ఘనంగా ఈ వేడుక జరగనుందని తెలుస్తోంది. ఇంతకుముందే పుష్ప 2 ప్రీరిలీజ్ వేడుకను అమెరికాలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని మైత్రి సంస్థ ప్రకటించింది. ఇప్పుడు పుష్ప టీమ్ స్ఫూర్తితో బాలయ్య కోసం అమెరికాలో ప్రీరిలీజ్ ప్లాన్ చేస్తుండడం ఆసక్తిని కలిగిస్తోంది.

## కల్కి-2.. ఎంతవరకు వచ్చిందంటే..



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ కాంబోలో తెరకెక్కిన కల్కి 2898 ఏడీ మూవీ ఎలాంటి హిట్ అయిందో అందరికి తెలిసిందే. భారీ బడ్జెట్ తో ప్రముఖ వైజయంతీ మూవీస్ బ్యానర్ పై అశ్వనీదత్ నిర్మించిన ఆ సినిమా.. బాక్సాఫీస్ వద్ద రూ.1000 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఆడియన్స్ ను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లింది. అయితే కల్కి మూవీకి సీక్వెల్ రానున్న విషయం తెలిసిందే. దీంతో సినీ ప్రియులు ఎంతగానో వెయిట్ చేస్తున్నారు. అందుకు సంబంధించిన అప్డేట్స్ ఎప్పుడిస్తారోనని ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే కల్కి 2 ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయని నిర్మాత అశ్వనీదత్ ఓ సందర్భంలో తెలిపారు. కొంత భాగం షూటింగ్ కూడా పూర్తి అయిందని చెప్పారు. ఇప్పుడు గోవాలో జరుగుతున్న ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ లో కల్కి నిర్మాతలు, అశ్వనీదత్ కుమార్తెలైన స్వప్న, ప్రియాంక.. కల్కి సీక్వెల్ కోసం మాట్లాడారు. షూటింగ్ అప్డేట్ ఇచ్చారు. పార్ట్ 2కు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. రెగ్యులర్ షూటింగ్ ఎప్పటి నుంచి ప్రారంభించాలనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. అన్నీ సిద్ధమయ్యాక అఫీషియల్ గా అనౌన్స్ చేస్తామని తెలిపారు. కల్కి 2898 ఏడీతో పాటు సీక్వెల్ కు సంబంధించిన షూటింగ్ పార్ట్ ను కొంతమేర ఇప్పటికే తీసినట్లు చెప్పారు. పార్ట్ 2కు సంబంధించి ఇప్పటి వరకు 35 శాతం షూట్ జరిగిందని వెల్లడించారు. బాలీవుడ్ హీరోయిన్ దీపికా పదుకొణె పార్ట్ -2లో కూడా నటిస్తున్నట్లు తెలిపారు. సీక్వెల్ లో కూడా దీపిక.. కొన్ని సీన్స్ లో అమ్మగా కనిపించనున్నారని చెప్పారు. అయితే ఫస్ట్ పార్ట్ షూటింగ్ జరుగుతున్నప్పుడు దీపిక గర్భిణీ. మూవీ రిలీజ్ తర్వాత ఆమె పండంటి బిడ్డకు జన్మనిచ్చారు. గోవాలో జరుగుతున్న ఇఫ్ఫీ వేడుకల్లో పాల్గొనడం చాలా హ్యాపీగా ఉందని ప్రియాంక, స్వప్న తెలిపారు. టాలీవుడ్ కు లభిస్తున్న ఆదరణ చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. ఇక కల్కి సినిమా విషయానికొస్తే.. అశ్వత్థామగా అమితాబ్ బచ్చన్, సుప్రీం యాస్కిన్ గా కమల్ హాసన్ మెప్పించారు. వారితో పాటు ఎంతో మంది యాక్టర్స్ సందడి చేశారు. బౌంటీ ఫైటర్ భైరవగా, చివర్లో కర్ణుడిగా ఆకట్టుకున్నారు ప్రభాస్. అలా పార్ట్-2పై మంచి అంచనాలు పెంచారు. మరి కల్కి సీక్వెల్ నుంచి ఫ్యూచర్ లో ఎలాంటి అప్డేట్స్ వస్తాయో వేచి చూడాలి.

## మహానటిని మిస్ అవ్వక తప్పదా..?

మహానటి తో జాతీయ స్థాయిలో గుర్తింపుతో పాటుగా అవార్డుని సైతం దక్కించుకుంది కీర్తి సురేష్. యువ హీరోలతో జత కట్టి ఆ పాపులారిటీతో స్టార్ సినిమాల్లో కూడా ఛాన్స్ అందుకుంది. ఇక మహానటి సినిమా అయితే కీర్తి గ్రాఫ్ మరింత పెరిగేలా చేసింది. తెలుగు, తమిళ భాషల్లో స్టార్ సినిమాలతో వరుస ఆఫర్లు అందుకున్న కీర్తి సురేష్ అప్పుడప్పుడు ప్రయోగాలు చేస్తూ వచ్చింది. ఐతే టాలీవుడ్ లో కన్నా కోలీవుడ్ లో అమ్మడు ఎక్కువ అవకాశాలు అందుకుంది. ఈ ఇయర్ కూడా అక్కడ రెండు సినిమాలు చేసింది. ప్రస్తుతం రివాల్వర్ రీటా, కన్నివేడి సినిమాలు చేస్తుంది. ఇక మరోపక్క అమ్మడు బాలీవుడ్ లోకి బేబీ జాన్ తో ఎంట్రీ ఇస్తుంది. ఆ సినిమా కూడా అమ్మడికి మరింత పాపులారిటీ తెచ్చేలా ఉంది. ఐతే కీర్తి సురేష్ పెళ్లి వార్తలు మీడియాలో ఎప్పుడు హాలిలిట్ టాపిక్కే. అమ్మడు సైలెంట్ గా ఉ ఎడటమే వీటికి మరింత బలం ఇస్తున్నాయి. లేటెస్ట్ గా తన స్నేహితుడు ఆంటోనితో కీర్తి సురేష్ పెళ్లికి రెడీ అయినట్టు మీడియా కోడై కూస్తుంది.



ఐతే ఈ విషయం దాదాపు కన్ ఫర్మ్ కాబట్టే కీర్తి సురేష్ నుంచి ఎలాంటి రియాక్షన్ లేదని అంటున్నారు. సడెన్ గా ఎంగేజ్మెంట్ తో ఫ్యాన్స్ కు సర్ ప్రైజ్ ఇవ్వాలని చూస్తుంది అమ్మడు. ఐతే పెళ్లి కూడా డిసెంబర్ 12 తేదీ అని అంటున్నారు. ఐతే పెళ్లి తర్వాత కీర్తి సురేష్ సినిమాలకు కొంత గ్యాప్ ఇవ్వక తప్పదు. సినిమాలు కొనసాగించే ఉద్దేశం ఉన్నా పెళ్లైన 6 నెలలు, ఏడాది వరకు ఆమె మరో సినిమా చేసే ఛాన్స్ లేదు. ఆ తర్వాత కూడా తను నటిగా కొత్త ప్రయోగాలు చేసే అవకాశం ఉంది కానీ గ్లామర్ రోల్స్ చేసే ఛాన్స్ ఉండదు. ముఖ్యంగా స్టార్ హీరోల సినిమాల్లో కీర్తిని చూడటం కష్టమే అని చెప్పొచ్చు. ఐతే కథ నచ్చితే కీర్తి సురేష్ ఎలాంటి వాటికైనా సిద్ధమే. తెలుగులో దసరా సూపర్ హిట్ కొట్టినా భోళా శంకర్ ఫ్లాప్ అవ్వడం తో పెద్దగా అవకాశాలు లేకుండా పోయాయి. పెళ్లి కాకముందే ఛాన్స్ లు లేవంటే ఆఫ్టర్ మ్యారేజ్ అసలు ఆమెను పట్టించుకుంటారా లేదా అన్నది కూడా చెప్పడం కష్టమే. మరి కీర్తి నెక్స్ట్ ప్లాన్ ఏంటన్నది తెలియాల్సి ఉంది. ఏది ఏమైనా కీర్తి సురేష్ పెళ్లి తర్వాత కూడా సినిమాలు చేసి ప్రేక్షకులను మెప్పించాలని ఆమె ఫ్యాన్స్ కోరుతున్నారు.

## రెస్టారెంట్ లో విజయ్, రష్మిక.. 'ఇంకెప్పుడు చెబుతారు!?'

టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మిక మందన్న.. రిలేషన్ లో ఉన్నట్లు ఎప్పటి నుంచో వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే వారిద్దరూ తాము ఫ్రెండ్స్ అని పలు సందర్భాల్లో చెప్పినా.. ప్రేమలో ఉన్నారని అంతా ఫిక్స్ అయిపోయారు. కొద్ది రోజుల క్రితం దీపావళిని విజయ్ ఇంట్లోనే రష్మిక జరుపుకున్నారని కూడా వార్తలు వచ్చాయి. అందుకు కారణం రష్మిక కామెంట్. తన పోస్ట్ లో థ్యాంక్యూ ఆనంద్ అంటూ విజయ్ దేవరకొండ తమ్ముడు, హీరో ఆనంద్ దేవరకొండకు ఫోటో క్రెడిట్ ఇచ్చారు. దీంతో విజయ్ ఇంట్లోనే రష్మిక ఫెస్టివల్ ను సెలబ్రేట్ చేసుకున్నారని అంతా ఫిక్స్ అయిపోయారు. ఆ తర్వాత రీసెంట్ గా మ్యూజిక్ ఆల్బమ్ సాహిబా ప్రమోషన్స్ లో విజయ్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. తన రిలేషన్ షిప్ స్టేటస్ గురించి మాట్లాడారు. తాను సింగిల్ కాదని తెలిపారు. రిలేషన్ లో ఉన్నానని చెప్పారు. కోస్టార్ తో డేటింగ్ చేశానని ఇన్ డైరెక్ట్ గా తెలిపారు. దీంతో విజయ్, రష్మిక పెళ్లి అనౌన్స్మెంట్ త్వరలో రానుందని అంతా మాట్లాడుకున్నారు. అదే సమయంలో ఇప్పుడు సోషల్ మీడియాలో ఆ జోడీకి సంబంధించిన పిక్ వైరల్ అవుతోంది.



ఓ రెస్టారెంట్ లో విజయ్, రష్మిక కలిసి తింటున్న పిక్.. నెట్టింట దర్శనమిచ్చింది. ఎవరో సీక్రెట్ గా ఆ ఫోటో తీసినట్లు అర్థమవుతుంది. అయితే ఆ పిక్ ఎప్పుడు, ఎక్కడ తీశారన్నది క్లారిటీ లేదు. కానీ సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతోంది. గుడ్ న్యూస్ ఎప్పుడు చెబుతారన్న అంటూ విజయ్ ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు. వెయిటింగ్ అని అంటున్నారు. మొత్తానికి రిలేషన్ షిప్ స్టేటస్ గురించి విజయ్ కామెంట్స్ చేసిన కొద్ది రోజులకే.. రెస్టారెంట్ లో ఇద్దరూ ఉన్న పిక్ బయటకు రావడంతో ఓ రేంజ్ లో అట్రాక్ట్ చేస్తోంది. అదే సమయంలో విజయ్, రష్మిక ప్రేమ కహానీ హాట్ టాపిక్ గా మారింది. అందరూ దాని కోసం తెగ మాట్లాడుకుంటున్నారు. క్యూట్ అండ్ లవ్లీ కపుల్ అంటూ నెటిజన్లు సందడి చేస్తున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే.. విజయ్ ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరి ప్రాజెక్ట్ ను పూర్తి చేస్తున్నారు. స్పై థ్రిల్లర్ గా రూపొందుతున్న ఆ మూవీ షూటింగ్ ఇప్పుడు చివరి దశకు చేరుకుంది. మరోవైపు, రష్మిక..పుష్ప సీక్వెల్ తో బిజీగా ఉన్నారు. త్వరలో శ్రీవల్లి 2.0గా సందడి చేయనున్నారు. మరి వారిద్దరూ తమ కొత్త చిత్రాలతో ఎలా మెప్పిస్తారో వేచి చూడాలి.




హైదరాబాద్: అదానీ గ్రూప్‌పై లంచాల విమర్శల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి ఇటీవల అదానీ గ్రూప్ ప్రకటించిన రూ.100 కోట్ల విరాళాన్ని స్వీకరించరాదని నిర్ణయించింది.

ఈ విషయాన్ని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆ గ్రూప్‌పై విమర్శల దృష్ట్యా అదానీ ఫౌండేషన్ నుంచి విరాళాన్ని తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆ అదానీ గ్రూపునకు లేఖ పంపినట్లు సీఎం వెల్లడించారు.

**అనవసర వివాదాల్లోకి ప్రభుత్వాన్ని లాగొద్దు :** "అదానీ విషయంలో కొన్ని రోజులుగా దేశ వ్యాప్తంగా చర్చలు జరుగుతున్నాయి. అదానీ నుంచి తెలంగాణ ప్రభుత్వం నిధులు స్వీకరించిందని కొందరు విమర్శలు చేస్తున్నారు. రాజ్యాంగ బద్ధంగా, చట్టబద్ధంగానే అదానీ నుంచి పెట్టుబడులు అనుమతిస్తాం. నిబంధనల మేరకే టెండర్లు పిలిచి ప్రాజెక్టులు ఇస్తున్నాం. దేశంలో ఏ సంస్థలకైనా చట్టబద్ధంగా వ్యాపారం చేసుకొనే హక్కు ఉంటుంది. అంబానీ, అదానీ, టాటా.. ఎవరికైనా తెలంగాణలో వ్యాపారం చేసుకొనే హక్కు ఉంది. గొప్ప సంకల్పంతో లక్షలాది మంది నిరుద్యోగులకు సాంకేతిక నైపుణ్యం నేర్పించే లక్ష్యంతో స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించాం. గొప్ప సదుద్దేశంతో ప్రారంభించిన ఈ వర్సిటీ వివాదాలకు లోను కావడం మంత్రివర్గ సహచరులకు, నాకు, ప్రభుత్వానికి ఇష్టంలేదు. అదానీ గ్రూప్ స్కిల్స్ వర్సిటీకి ఇచ్చిన విరాళాన్ని సీఎం, మంత్రులకు ఇచ్చినట్లు కొందరు ప్రచారం చేస్తున్నారు. సీఎస్ఆర్ కింద స్కిల్స్ వర్సిటీకి అదానీ గ్రూప్ ప్రకటించిన రూ.100 కోట్లు బదిలీ చేయొద్దని కోరుతూ ఆ గ్రూప్‌నకు లేఖ పంపాం. అనవసర వివాదాల్లోకి రాష్ట్ర ప్రభుత్వాన్ని లాగొద్దు. తెలంగాణ ప్రభుత్వ ఖాతాల్లోకి ఎవరి నుంచీ డబ్బులు రాలేదు" అని సీఎం అన్నారు.

**అవసరమైతే దిల్లీకి ఎన్నిసార్లైనా వెళ్తాం :** "నేటి దిల్లీ పర్యటనకు రాజకీయాలతో సంబంధంలేదు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కుమార్తె వివాహం కోసమే దిల్లీకి వెళ్తున్నాం. పార్లమెంటు సమావేశాలపై ఎంపీలతో మంగళవారం చర్చిస్తాం. అందుబాటులో ఉన్న కేంద్ర మంత్రులను రేపు కలిసి రాష్ట్ర సమస్యల్ని వివరిస్తాం. 28 సార్లు దిల్లీ వెళ్లానని కొందరు విమర్శిస్తున్నారు. నేను వారిలా పైరవీలు చేయడానికో.. బెయిల్ కోసం దిల్లీకి వెళ్లలేదు. కేంద్రం నుంచి మనకు రావాల్సినవి రాబట్టుకోవాలి. అవసరమైతే దిల్లీకి ఎన్నిసార్లయినా వెళ్తాం" అన్నారు.

**జైలుకెళ్లాలని కేటీఆర్ తహతహలాడుతున్నారు..** "బీఆర్ఎస్ సర్కారు అదానీకి గతంలో ఎన్నో ప్రాజెక్టులు ఇచ్చింది. అదానీతో బీఆర్ఎస్ సర్కారు అంటకాగింది. అదానీ వద్ద వాళ్లు కమీషన్లు తిన్నారు. కేటీఆర్ జైలుకు వెళ్లాలని తహతహలాడుతున్నారు. జైలుకెళ్తే సీఎం అవ్వొచ్చని అనుకొంటున్నారు. కేసీఆర్ కుటుంబం నుంచి ఇప్పటికే కవిత జైలుకు వెళ్లారు. జైలుకెళ్లినవారు సీఎం అయ్యేదుంటే ముందు కవిత అవుతారు. కేసీఆర్ కుటుంబంలో సీఎం సీటు కోసం పోటీ ఎక్కువగా ఉంది" అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# ప్రజలు అధికారమిచ్చింది అల్లర్లు సృష్టించేందుకేనా?: యూపీ అల్లర్లపై రాహుల్



లఖ్‌నవూ: ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో న్యాయస్థానం ఆదేశాలతో ఓ ప్రార్థనా మందిరంలో సర్వే నిర్వహిస్తుండగా హింస చెలరేగింది. ఈ ఘర్షణలో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ స్పందించారు. అధికారంలో ఉన్న భాజపాపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

**సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలి..** "సంభాల్‌లో జరిగిన హింసాత్మక ఘటనపై విచారణ వ్యక్తంచేస్తున్నా. భాజపా ప్రజలపై నిర్లక్ష్యం వహిస్తోంది. ప్రజలు అధికారం ఇచ్చింది చీలికలు సృష్టించడానికేనా..? దేశ ప్రయోజనాలను మరిచి.. మతాలు, వర్గాల మధ్య ఆ పార్టీ చిచ్చుపెడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం పక్షపాత ధోరణి చూపడం ఆందోళనకరం. దయచేసి ఈవిషయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని కోరుతున్నాను. బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని 'ఎక్స్' (ట్విటర్) వేదికగా పేర్కొన్నారు.

**భాజపాదే బాధ్యత..** "అన్ని పార్టీల సలహాలు తీసుకోకుండా పాలనా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఇది ప్రస్తుత పరిస్థితిని మరింత దిగజార్చుతోంది. ప్రజల మరణాలకు దారితీసింది. ఈ ఘటనపై భాజపా ప్రభుత్వమే బాధ్యత వహించాలి" అని రాహుల్ డిమాండ్ చేశారు. కుల, మత ద్వేషాలు లేకుండా భారతీయులంతా ఐక్యమత్యంగా ఉండాలని.. రాజ్యాంగం చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. కాగా.. జిల్లా కేంద్రం సంభాల్‌లో ఓ ప్రార్థనా మందిరాన్ని సర్వే చేయాలంటూ కోర్టు ఆదేశించింది.

ఈ సర్వే కొనసాగుతున్న సమయంలో అల్లర్లు చెలరేగాయి. స్థానికులు, పోలీసులపై రాళ్లతో దాడికి పాల్పడ్డారు. పోలీసులు, అధికారుల వాహనాలకు నిప్పంటించారు. అక్కడ జరిగిన ఘర్షణల్లో ముగ్గురు యువకులు మృతిచెందగా.. మరో వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై తాజాగా స్పందించిన రాహుల్ గాంధీ.. భాజపాపై నిప్పులు చెరిగారు.

# దేశ ప్రజలే వారికి సరైన శిక్ష విధిస్తారు.. విపక్షాలపై ప్రధాని మోదీ మండిపాటు



రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు అవుతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గుర్తు చేశారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభానికి ముందు పార్లమెంట్ వెలుపల మీడియా పాయింట్ వద్ద ప్రధాని మాట్లాడారు. ఈ సందర్భంగా విపక్ష ఇండియా కూటమిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రజలచే తిరస్కరణకు గురైన కొందరు గూండాయిజం ద్వారా పార్లమెంట్ ను నియంత్రించేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నారంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. దేశ ప్రజలు వారి చర్యలన్నింటినీ లెక్కిస్తారని.. సరైన సమయంలో శిక్ష విధిస్తారని వ్యాఖ్యానించారు. 'కొందరు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పని చేస్తున్నారు. ప్రజలచే తిరస్కరణకు గురైన కొందరు గూండాయిజం ద్వారా పార్లమెంటుపై నియంత్రణకు ప్రయత్నిస్తున్నారు. సొంత లబ్ధి కోసం పార్లమెంటు సమావేశాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. దేశ ప్రజలు వారి చర్యలన్నింటినీ లెక్కిస్తారు. సరైన సమయంలో ప్రజలే శిక్ష విధిస్తారు. పార్లమెంట్‌లో సానుకూల చర్చలు జరగాలని కోరుకుంటున్నా' అని మోదీ వ్యాఖ్యానించారు. ఈ పార్లమెంట్ సమావేశాలు ఎన్నో అంశాలపరంగా ముఖ్యమైనవని ప్రధాని అన్నారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి నవంబర్ 26 నాటికి 75వ ఏడాదిలోకి అడుగుపెడుతున్నామన్నారు. దానికి గుర్తుగా రేపు సంవిధాన్ సదన్‌లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. రాజ్యాంగ అమలు ఉత్సవాలు ఐక్యంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు.

# ఆర్థిక క్రమశిక్షణతో ఒక్కో హామీ నెరవేరుస్తున్నాం: మంత్రి పొన్నం




హుజూరాబాద్: మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిపాలైందని మాజీ మంత్రి హరీశ్‌రావు సంబర పడుతున్నారా? భాజపా గెలిచిందని సంతోషపడుతున్నారా? అని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి హాజరై మాట్లాడారు. "తెరాసను భారాసగా పేరు మార్చారు. మహారాష్ట్రకు వందల కార్లలో వెళ్లి కనీసం పోటీ కూడా చేయలేకపోయారు. మేం మొదటి నుంచీ చెబుతున్నాం. భారాస, భాజపా దిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీలా వ్యవహరిస్తున్నాయి. ఇది మరోసారి నిరూపణ అయింది. అందుకే పార్లమెంటు ఎన్నికల్లో భారాస ఒక్క సీటు కూడా సాధించలేకపోయింది. ప్రతిదీ రాజకీయంగా ఆలోచిస్తే ప్రజాస్వామ్యం మనుగడకే ప్రమాదం. మొన్నటి వరకు పంట మొత్తం కాళేశ్వరం వల్లే అన్నారు. కాళేశ్వరం లేకున్నా ఎల్లంపల్లి నుంచి పొదుపుగా నీరు వాడుకొని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా రాని పంట ఇప్పుడు వచ్చింది.. ప్రకృతి సహకరించింది. రూ.20 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని రైస్ మిల్లర్లకు చెప్పాం. ఇంకా ఎవరైనా ఉంటే ప్రభుత్వంతో మాట్లాడి బకాయిలు చెల్లించాలి. ధాన్యం కొనుగోళ్లలో కొంత ఆలస్యం అయినందుకు కల్లాల వద్దకు వచ్చి ప్రతిపక్ష నాయకులు ఇష్టారీతిన మాట్లాడారు. సన్న వడ్లకి రూ.500 బోనస్ ఇస్తున్నాం.. రాష్ట్రంలో ఎవరికైనా రాకపోతే చెప్పాలి. మాట మీద నిలబడి రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేశాం. ఎవరికైనా రుణమాఫీ కాకపోతే వ్యవసాయ అధికారుల ద్వారా కుటుంబ నిర్ధరణ జరుగుతోంది. ప్రభుత్వం సమాచారం సేకరిస్తుంది. వారికి కూడా తప్పకుండా రుణమాఫీ చేసే బాధ్యత మా ప్రభుత్వానిదే. ప్రజా పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేలను ప్రజలు స్వేచ్ఛగా కలవగలుగుతున్నారు. మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే చూస్తే రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉంది. అయినా ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ఒక్కో హామీని నెరవేరుస్తున్నాం. ఎన్నో ఇబ్బందులు ఉన్నా ఒకటో తేదీనే జీతాలు వస్తున్నాయి. 11 నెలల్లోనే ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం. గత పదేళ్లలో భాజపా, భారాస ఏం చేసిందో ప్రజలు గమనించాలి"అని మంత్రి పొన్నం అన్నారు.

# కామారెడ్డి డిక్లరేషన్‌ను యథాతథంగా అమలు చేయాలి: ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లకు సంబంధించి కామారెడ్డి డిక్లరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం యథాతథంగా అమలు చేయాలని భారాస ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఇప్పటికే అనేక బీసీ సంఘాలు, మేధావులు ఇచ్చిన సూచనలు అమలుకు నోచుకోలేదన్నారు. హైదరాబాద్‌లో డెడికేటెడ్ కమిషన్ ఛైర్మన్ బుసాని వెంకటేశ్వరరావుకు ఆమె వినతిపత్రం అందజేశారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు. "కాంగ్రెస్ ప్రభుత్వం 11 నెలలు తాత్సారం చేసింది. డెడికేటెడ్ కమిటీ స్వతంత్రంగా పనిచేయాలి. ప్రత్యేక కార్యాలయం, మానవ వనరులు, సామగ్రి ఇవ్వకుంటే ఆ కమిటీ ఎలా పనిచేస్తుంది? కులగణనపై నెల రోజుల్లో నివేదిక అంటే ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి చట్టబద్ధత కల్పించాలి. రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి. హైదరాబాద్‌లో ఇప్పటికీ 70 శాతం స్టిక్కర్ వేయని ఇళ్లు ఉన్నాయి. 90 శాతం సర్వే పూర్తయిందని ప్రభుత్వం చెబుతోంది. డేటా కంప్యూటరీకరణ చేశారా?" అని కవిత ప్రశ్నించారు.

# కొడంగల్ రైతుల బాధలు వినే ఓపిక, తీరిక సీఎంకు లేవు: కేటీఆర్



మహబూబాబాద్: తెలంగాణ ఉద్యమంలో మానుకోటకు ప్రత్యేక స్థానం ఉందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. లగచర్ల బాధితులకు మద్దతుగా మహబూబాబాద్‌లో నిర్వహించిన మహాధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొత్త నియంత రేవంత్‌కు మానుకోట ధర్నా బుద్ధి చెప్పబోతుందని విమర్శించారు. 9 నెలలుగా కొడంగల్‌లో ఎస్టీ, ఎస్సీ, బీసీ రైతులు తిరగబడ్డారని చెప్పారు. మూడు వేల ఎకరాలు గుంజుకోవాలని సీఎం ప్రయత్నిస్తున్నారన్నారు. తమ భూములు గుంజుకోవద్దని కొడంగల్ రైతులు కోరుతున్నారని చెప్పారు. అక్కడి అన్నదాతల బాధలు వినే ఓపిక, తీరిక సీఎంకు లేవని ఎద్దేవా చేశారు. "రేవంత్‌రెడ్డి 28 సార్లు దిల్లీ వెళ్లినా.. 28 రూపాయలు కూడా తీసుకురాలేదు. లగచర్లలో జరిగిన దాడి అధికారులపై జరిగింది కాదు.

అక్కడ దాడి జరిగితే మానుకోటలో ధర్నా ఎందుకని పోలీసులు అంటున్నారు. ఎక్కడ గిరిజన, ఎస్సీ, బీసీ, బడుగు రైతులు ఉంటారో అక్కడ ధర్నా చేస్తాం. ఈ సీఎం ప్రజల కోసం పని చేయట్లేదు.. అదానీ కోసం పని చేస్తున్నారు. ఈ సీఎం తన బంధువుల కోసమే పని చేస్తున్నారు.. ప్రజల కోసం కాదు. 6 గ్యారంటీలు 100 రోజుల్లో అమలు చేస్తామన్నారు.. ఏడాది పూర్తవుతోంది.. అమలు చేశారా?" అని కేటీఆర్ ప్రశ్నించారు.

# మేం కేసీఆర్ తయారు చేసిన దళం.. భయపడే ప్రసక్తే లేదు..

## కాంగ్రెస్ నాయకుల బెదిరింపులపై కేటీఆర్ స్ట్రాంగ్ వార్నింగ్



కేసీఆర్ ఉన్నప్పుడు రైతుబంధు, రైతు బీమా, 24 గంటలు కరెంట్ టైమ్ వస్తుండే అని కేటీఆర్ తెలిపారు. అదే రేవంత్ రెడ్డి వచ్చాక రైతుబంధు ఎగ్గొట్టిండని.. పింఛన్ పెంచలేదని.. బోనస్ బోగస్ అయ్యిందని తెలిపారు. ఆడబిడ్డలకు మహాలక్ష్మి స్కీం రాలేదని అన్నారు. . గిరిజన, దళిత, పేద రైతులకు మద్దతుగా మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నాడు నిర్వహించిన మహాధర్నాలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మహారాష్ట్రకు పోయి కూడా ఆడబిడ్డలను మోసం చేసే ప్రయత్నం చేస్తే అక్కడి ఆడబిడ్డలు బుద్ధి చెప్పారని తెలిపారు. వీడు పచ్చి లంగా, తెలంగాణలో ఆడబిడ్డలను మోసం చేశాడని చైతన్యం ప్రదర్శించి తన్ని తన్ని తరిమేశారని పేర్కొన్నారు. నేను ఇక్కడ వస్తుంటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాళ్లతో కొడతమని అంటున్నారని కేటీఆర్ తెలిపారు. నేను డీజీపీ, ఎస్పీ గారిని అడుగుతున్నా.. రాళ్లతో కొడతామంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కేసులు మా మీద మాత్రమే పెడుతారా? కాంగ్రెస్ ఎమ్మెల్యేల మీద కేసులు ఉండవా? అని నిలదీశారు. మా గిరిజన రైతుల కోసం కదులుతూ మానుకోటలో ధర్నా చేస్తామంటే%ొ%లగచర్లలో జరిగిన సంఘటనకు మానుకోటలో ధర్నా ఎందుకు అని డీజీపీ ప్రశ్నించారని తెలిపారు. కొడంగల్ రైతుల కోసం ఒక్క మానుకోటలోనే కాదు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఎక్కడెక్కడ దళితులు, బీసీలు, గిరిజనులు ఉన్నారో అక్కడ ధర్నా చేస్తామని స్పష్టం చేశారు. సన్నకారు, బక్క చిక్కిన రైతులతో పెట్టుకున్న ఈ రేవంత్ రెడ్డికి తప్పకుండా బుద్ధి చెప్పే సమయం వస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు. .రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకిలించే దాకా వదిలిపెట్టమని చెప్పారు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు రాళ్లతో కొడతామంటే, పెట్రోల్ పోస్తామంటే భయపడమని కేటీఆర్ అన్నారు. మేము కేసీఆర్ తయారు చేసిన దళం.. భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మానుకోట రాళ్ల మహత్యం ఏందో తెలంగాణను అడ్డుకున్న వాళ్లందరికీ తెలుసని అన్నారు. మానుకోటలో 14 ఏళ్ల క్రితమే నిప్పు పుట్టి ఆ తర్వాత తెలంగాణ వచ్చిందని అన్నారు. ఇవాళ మీరు పర్మిషన్ ఇవ్వకుంటే హైకోర్టుకు వెళ్లి పర్మిషన్ తెచ్చుకున్నా మని అన్నారు. ఈ మహా ధర్నాకు వెయ్యి మంది అనుకుంటే 25 వేల మంది వచ్చారని.. అంటే ప్రభుత్వం మీద ఎంత కోపం, వ్యతిరేకత ఉందో ఈ మానుకోట మహాధర్నా చూస్తే అర్థమవుతోందని అన్నారు.

# పట్నం నరేందర్‌రెడ్డి పిటిషన్‌పై హైకోర్టులో ముగిసిన వాదనలు.. తీర్పు రిజర్వ్



హైదరాబాద్: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. లగచర్ల దాడి ఘటనలో బొంరాస్‌పేట పోలీసులు 3 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఒకే ఘటనపై వేర్వేరు కేసులు నమోదు చేయడాన్ని నరేందర్ రెడ్డి ఉన్నత న్యాయస్థానంలో సవాల్ చేశారు. ఈ నేపథ్యంలో వాదనల సందర్భంగా ఒకే సంఘటనపై వేర్వేరు కేసులు నమోదు చేయొద్దన్న సుప్రీంకోర్టు తీర్పులను పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రస్తావించారు. కేసులకు సంబంధించిన వివరాలను ఏఏజీ రజనీకాంత్ కోర్టుకు తెలిపారు. దాడి ఆధారంగా పోలీసులు వేర్వేరు కేసులు నమోదు చేశారని చెప్పారు. ఇరువైపుల వాదనలు ముగియడంతో.. హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

# కార్తికమాసం చివరి సోమవారం.. వేములవాడకు పోటెత్తిన భక్తులు



వేములవాడ: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కార్తిక మాసం చివరి సోమవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాజన్న సన్నిధిలో కార్తిక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు బారులు తీరడంతో గర్భాలయంలో ఆర్జిత, అన్న పూజల సేవలను అధికారులు రద్దు చేశారు. స్వామివారి దర్శనానికి 3 గంటలకుపైగా సమయం పడుతున్నది. భద్రాచలంలో గోదావరిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి.. నదిలో కార్తిక దీపాలు వదిలారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. సోమవారం తెల్లవారుజామునే ఆలయాలకు చేరుకున్న భక్తులు.. కార్తిక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. గరళకంఠుడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కాగా, నవంబర్ 2న ప్రారంభమైన కార్మిక మాత్రం ఈ వారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కార్మిక మాస చివరి సోమవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు తరలివచ్చారు.

# శబరిమలకు పోటెత్తిన భక్తులు.. 9 రోజుల్లో రూ.41 కోట్ల ఆదాయం

శబరిమలఅయ్యప్ప ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. మండల దీక్ష చేసిన అయ్యప్ప దీక్షా స్వాములతోపాటు వేలాదిగా భక్తులు శబరిమలకు తరలివస్తున్నారు. దీంతో శబరిగిరులు అయ్యప్ప నామస్మరణతో మారుమ్రోగుతున్నాయి. పెద్ద సంఖ్యలో మాలధారులు రావడంతో స్వామివారి దర్శనానికి దాదాపు 10 గంటల సమయం పడుతోంది. సన్నిధానం నుంచి పంబ వరకు అయ్యప్ప భక్తులు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. గతేడాదితో పోలిస్తే రెట్టింపు సంఖ్యలో భక్తులు శబరిమలకు తరలివస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. మండల – మకరవిళక్కు సీజన్‌లో భాగంగా మొదటి తొమ్మిది రోజుల్లోనే ఏకంగా ఆరు లక్షల మందికిపైగా భక్తులు అయ్యప్పను దర్శించుకున్నట్లు దేవస్థానం బోర్డు ట్రావెన్‌కోర్ దేవస్వాం తెలిపింది. నవంబర్ 16న ఆలయం తెరుచుకోగా, ఈ తొమ్మిది రోజుల్లోనే 6,12,290 మంది భక్తులు అయ్యప్పను దర్శించుకున్నట్లు వెల్లడించింది. గతేడాది ఇదే సీజన్‌లో కేవలం 3,03,501 మంది మాత్రమే స్వామి వారిని దర్శించుకున్నట్లు తెలిపింది. పోలీసుల ముందస్తు చర్యలతో ప్రస్తుతం నిమిషానికి 80 మంది భక్తులు ఆలయంలోకి పవిత్రమైన పడి మెట్లను ఎక్కగలుగుతున్నారని పేర్కొంది. మరోవైపు భక్తుల రద్దీ పెరగడంతోపాటు ఆదాయం కూడా భారీగా సమకూరినట్లు దేవస్థానం బోర్డు వెల్లడించింది. గతేడాది ఇదే సమయంలో రూ.28.3 కోట్లు ఆదాయం రాగా.. ఈ సారి అది రూ.41.64 కోట్లకు పెరిగినట్లు తెలిపింది.

గతేడాదితో పోలిస్తే ఇది రూ.13.33 కోట్ల ఎక్కువ అని వెల్లడించింది. ఇక భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. వండిపెరియార్ సత్రం, ఎరుమేలి, పంబాలలో మూడు ఆన్‌లైన్ బుకింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దర్శనం లేకుండా ఏ భక్తుడు కూడా తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి లేదని అన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com